APTEL /26/A1193

నేటి
# శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి....



ప్రతిక్షణం... ప్రజల కోసం...
www.netishubhodaya.com
96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, సంపుటి : 1 సంచిక : 181 సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు పేజీలు : 8 శుక్రవారం 21 ఆగస్టు 2026 వెల : 05/-

### అసెంబ్లీకి రాకుండా
# పారిపోతున్న జగన్



అమరావతి, ఆగస్టు 20 : ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించే పరీక్షల వ్యవస్థపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌కు అవగాహన లేదని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి లోకేశ్ గురువారం కౌంటర్ ఇచ్చారు. ఏపీపీఎస్సీ, డీఎస్సీ రెండూ ఒకటే అనుకుంటున్నారా? అంటూ వైసీపీ అధినేతపై మండిపడ్డారు. APPSC అంటే ఏమిటో, DSC అంటే ఏమిటో జగన్‌కు తెలియదంటూ వ్యంగ్యంగా అన్నారు. ఈ రెండు పరీక్షలను ఒకే గాటిన కట్టడం, ఒకటే అనుకోవడం జగన్ అవగాహన స్థాయిని తెలియజేస్తుంటూ ఎద్దేవా చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించ లేదని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు డీఎస్సీ నిర్వహించ లేకపోయారు.. ప్రస్తుతం అసెంబ్లీలో చర్చకు

2 లో

### 'వందేమాతరం'పై కాంగ్రెస్ నిర్ణయం దేశాన్ని
# అవమానించడమే



ఆగస్టు 20 : 'వందేమాతరం' విషయంలో కాంగ్రెస్ పార్టీ తీసుకున్న నిర్ణయంపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (CWC) 1937 నాటి తీర్మానాన్ని అనుసరిస్తూ జాతీయ గేయంలోని తొలి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలని నిర్ణయించడం దేశాన్ని అవమానించడమేనని ఆయన విమర్శించారు. ఈ నిర్ణయం జాతి వ్యతిరేకమని ఆరోపించారు. కాంగ్రెస్

మిగతా 2లో...




# ఏపీలో మిలాద్-ఉన్-నబి సెలవు తేదీ మార్పు

అమరావతి, ఆగస్టు 20 : మిలాద్-ఉన్-నబి పండుగకు సంబంధించిన సెలవు తేదీని మారుస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ముందుగా ప్రకటించిన ఆగస్టు 25కు బదులుగా ఆగస్టు 26వ తేదీని(బుధవారం) సాధారణ సెలవు దినంగా ప్రకటించింది. చంద్ర దర్శనం ఆధారంగా ఈ ఏడాది మిలాద్-ఉన్-నబి పండుగ ఆగస్టు 26న వస్తుందని ఏపీ స్టేట్ వక్ఫ్ బోర్డు ప్రభుత్వానికి తెలియజేసింది.

మిగతా 2లో...

# నా కుమార్తె వ్యాఖ్యలు పూర్తిగా వ్యక్తిగతం

- రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ కూతురు సుస్మిత అనుచిత వ్యాఖ్యలు
- కొండా సురేఖకు నోటీసులు జారీ చేసిన పీసీసీ క్రమశిక్షణ కమిటీ
- కమిటీ ఎదుట హాజరై వివరణ ఇచ్చిన సురేఖ



ఆగస్టు 20 : సీఎం రేవంత్ రెడ్డి, పరకాల నియోజకవర్గంపై తన కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగత అభిప్రాయాలని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ జారీ చేసిన నోటీసులకు స్పందిస్తూ, హైదరాబాద్‌లోని కమిటీ ఎదుట హాజరై ఈ మేరకు తన వివరణను సమర్పించారు. తన కుమార్తె అయినంత మాత్రాన ఆమె వ్యక్తం చేసిన రాజకీయ, వ్యక్తిగత

2లో

### వికసిత్ భారత్ నిర్మాణంలో దక్షిణాది ప్రాంతం కీలక ఆర్థిక శక్తిగా
# ఎదగాలి

చెన్నై, ఆగస్టు 20 : వికసిత్ భారత్ నిర్మాణంలో దక్షిణాది ప్రాంతం కీలక ఆర్థిక శక్తిగా ఎదగాలనీ ఏపీ సీఎం నారా చంద్ర బాబు నాయుడు ఆకాంక్షించారు. గురువారం తమిళనాడులోని మహాబలిపురంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా



అధ్యక్షతన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ఏపీ సహా దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి గురించి ప్రస్తావించారు. దక్షిణాది రాష్ట్రాల మధ్య సహకారమే లక్ష్యమని తెలిపారు. కేంద్ర - రాష్ట్రాల మధ్య విశ్వాసం, పరస్పర సహకారంతో సమస్యల పరిష్కారం జరగాలని ఏపీ సీఎం సూచించారు. ఈ సందర్భంగా ఏపీ, కర్ణాటక, తమిళనాడును అనుసంధానించేలా బుల్లెట్ ట్రైన్ కారిడార్‌ను ఆయన ప్రతిపాదించారు. కుప్పం మీదుగా బుల్లెట్ ట్రైన్ నడపాలని పేర్కొన్నారు. రాజధాని అమరావతి - బెంగళూరు - చెన్నై నగరాలను అనుసంధానించేలా ఈ రవాణా వ్యవస్థ ఉండాలని స్పష్టం చేశారు.ల అలాగే దక్షిణాది రాష్ట్రాల్లో ఉమ్మడి లాజిస్టిక్స్ నెట్‌వర్క్, డ్రై పోర్టులు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను సీఎం చంద్రబాబు వివరించారు. దక్షిణాది విద్యుత్ గ్రిడ్‌ను జాతీయ గ్రిడ్‌తో అనుసంధానించాలనీ చెప్పారు. దక్షిణాది రాష్ట్రాల యూనివర్సిటీలు, స్కిల్లింగ్ సంస్థలతో ఉమ్మడి కన్సార్టియం ఏర్పాటు చేయాలని తెలిపారు. విపత్తుల సమయంలో రాష్ట్రాలు పరస్పరం సహకరించుకునేలా మ్యూచువల్ ఎయిడ్ ఫోర్స్ ఏర్పాటును ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రతిపాదించారు. తిరుపతి నుంచి కాశీ, అయోధ్య, చార్ ధామ్ వరకు ఉమ్మడి ఆధ్యాత్మిక పర్యాటక సర్క్యూట్ ఏర్పాటు చేయాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. దేశ జీడీపీలో దక్షిణాది రాష్ట్రాల వాటా సుమారు 31 శాతం ఉందని ఆయన

2 లో

### అమరావతిలో ఎంట్రీకి అందుబాటులోకి రానున్న
# మరిన్ని రహదారులు..



అమరావతి, ఆగస్టు 20 : రాజధాని అమరావతిలో ఎంట్రీకి మరిన్ని రహదారులను త్వరితగతిన అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అందులో భాగంగా సీడ్ యాక్సెస్ రోడ్డు ప్రారంభంతో ఇతర రహదారుల కనెక్టివిటీపై మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి నారాయణ దృష్టి సారించారు. గురువారం E 13, E 15, E 1, E 3 రహదారి నిర్మాణ పనుల పురోగతిపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. మంగళగిరి నుంచి అమరావతికి లోకి ప్రవేశించే E 15 రోడ్డు పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రికి అధికారులు వివరించారు. 16వ నెంబర్ జాతీయ రహదారి నుంచి ఎయిమ్స్ ద్వారా అమరావతిలోకి ఙు 13 రోడ్డు ప్రవేశించనుంది. సీడ్ యాక్సెస్ రోడ్డు (E 3) మూడో ఫేజ్‌లో నిర్మించే ఎలివేటెడ్ కారిడార్

మిగతా 2లో...

### మోదీ, అమిత్ షాల రాజకీయ
# అధ్యాయం ముగిసింది

- ఎన్డీయేలో బీజేపీ ఆధిపత్యం క్షీణించిందన్న రాహుల్
- మోదీ, అమిత్ షా రాజకీయ ఆధిపత్యం తగ్గిందని వ్యాఖ్య
- కాంగ్రెస్, ఇండియా కూటమి వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని వెల్లడి

ఆగస్టు 20 : లోక్‌సభ ప్రతిపక్ష నేత,



2లో

### దక్షిణాది రాష్ట్రాలు ఏకతాటిపైకి రావాలి..
## మన మధ్య బలమైన
# సహకారం అవసరం




2 లో

- దక్షిణాది రాష్ట్రాల మధ్య సహకారం పెరగాలన్న సీఎం విజయ్
- డ్రగ్స్ రహిత దక్షిణ భారతం కోసం కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపు
- ఆర్థిక కూటమిగా ఏర్పడి ప్రయోజనాలు కాపాడుకోవాలని సూచన
- నీట్ రద్దు, డీలిమిటేషన్‌పై హామీ ఇవ్వాలని కేంద్రానికి డిమాండ్



### సజ్జల రామకృష్ణారెడ్డిపై సంగం డెయిరీ
# పరువు నష్టం కేసు

అమరావతి, ఆగస్టు 20 : సంగం డెయిరీ.. వైసీపీ నేత సజ్జల

మిగతా 2లో...

# భారత ఉపరాష్ట్రపతి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**-కృష్ణా జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎం. నవీన్**





గన్నవరం: ఆగస్టు 20: ఈ నెల 24వ తేదీన భారత ఉపరాష్ట్రపతి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి రానున్న నేపథ్యంలో పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని కృష్ణాజిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎం. నవీన్ అధికారులను ఆదేశించారు.గురువారం సాయంత్రం విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయములోని విశిష్ట అతిథుల భవన సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడుతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో ఉపరాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపరాష్ట్రపతి ఏలూరు జిల్లాలో జరిగే కార్యక్రమంలో పాల్గొననున్నందున, గన్నవరం విమానాశ్రయంలో స్వాగతం, తిరుగు ప్రయాణ కార్యక్రమాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టాలని తెలిపారు. పర్యటన ఏర్పాట్లకు ఆర్డీఓ గుడివాడను ఓవరాల్ ఇన్‌చార్జిగా నియమించి, అన్ని శాఖల అధికారులు ఆయనతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.వీఐపీ రిసెప్షన్, గ్రీన్ రూమ్‌లు, పార్కింగ్, అల్పాహారం, వైద్య సదుపాయాలు తదితర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని తెలిపారు. ఉపరాష్ట్రపతికి అందించే ఆహారం, అల్పాహారం నాణ్యతను ఫుడ్ సేఫ్టీ అధికారులు పర్యవేక్షించాలని, అవసరమైన నమూనాలను సేకరించి పరీక్షించాలని ఆదేశించారు.వైద్యపరంగా అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే స్పందించేలా డీఎంహెచ్‌ఓ, డీసీహెచ్‌ఎస్, జీజీహెచ్, ఏపీవీవీపీ అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అత్యవసర వైద్య పరికరాలు, వైద్య నిపుణులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ ఉపరాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో విమానాశ్రయం నుంచి ఏలూరు జిల్లా ముసునూరు వరకు భద్రతా చర్యలను పటిష్టంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఉపరాష్ట్రపతి కాన్వాయ్‌ను ఏలూరు జిల్లా నుంచి ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో కృష్ణాజిల్లా పరిధిలో అవసరమైన పైలట్ వాహనాలను సమన్వయం చేయాలని తెలిపారు. విమానాశ్రయం నుంచి గమ్యస్థానం వరకు మొత్తం రూట్‌ను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి, ముఖ్యమైన రూట్ పాయింట్లను గుర్తించాలని సూచించారు.విమానాశ్రయంలోని కొత్త టెర్మినల్‌తో పాటు అన్ని కీలక ప్రాంతాలను భద్రతా పరిధిలోకి తీసుకురావాలని తెలిపారు. విమానాశ్రయం, పార్కింగ్ ప్రాంతాలు, మొత్తం ప్రయాణ మార్గంలో బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, వీడియో బృందాలను అవసరమైన విధంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పార్కింగ్ ప్రాంతాల్లోకి వచ్చే వాహనాలను పూర్తిస్థాయిలో తనిఖీ చేసిన అనంతరం మాత్రమే అనుమతించాలని, అనధికారిక వాహనాలు, జనసమూహాలను ప్రధాన మార్గం వద్దనే నియంత్రించాలని స్పష్టం చేశారు.ట్రాఫిక్ నిర్వహణలో భాగంగా జాతీయ రహదారిపై ముఖ్యమైన జంక్షన్లు, ఫ్లైఓవర్ల కింద ఉన్న జాయినింగ్ పాయింట్లను గుర్తించి బారికేడింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. కాన్వాయ్ మార్గంలో వాహనాలు అకస్మాత్తుగా ప్రవేశించకుండా ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని సూచించారు.సమావేశంలో ఇంచార్జ్ ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ ఏకే దేశ్వాల్, విమానాశ్రయ సీఎస్‌వో కె. ధర్మేంద్ర, డిప్యూటీ కలెక్టర్ ఎస్ పోతురాజు, గుడివాడ ఆర్డిఓ జి బాలసుబ్రమణ్యం, గన్నవరం తహసిల్దార్ శివయ్య, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, స్పెషల్ బ్రాంచ్ సిఐ వై సత్య కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

# దక్షిణాది రాష్ట్రాలు ఏకతాటిపైకి రావాలి.. మన మధ్య బలమైన సహకారం అవసరం

ఆగష్టు 20 : డ్రగ్స్ రవాణాపై ఉమ్మడి పోరాటం, ఆర్థిక కారిడార్ల నిర్మాణం, బ్లూ ఎకానమీ విస్తరణ, దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి ప్రయోజనాల పరిరక్షణ కోసం అన్ని రాష్ట్రాలు సహకారంతో ముందుకు సాగాలని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ పిలుపునిచ్చారు. మహాబలిపురంలో 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ పలు కీలక అంశాలను ప్రస్తావించారు. దేశ జీడీపీలో 30 శాతానికి పైగా వాటా కలిగిన దక్షిణాది రాష్ట్రాలు తయారీ, ఎగుమతులు, సేవల రంగాల్లో కేంద్రంగా నిలుస్తున్నాయని ఆయన గుర్తుచేశారు.

ఆర్థిక కూటమిగా ఎదగాలి

తయారీ జోన్లు, లాజిస్టిక్స్ పార్కులు, ఫ్రైట్ కారిడార్ల ద్వారా దక్షిణ ప్రాంతం ఒక సమీకృత ఆర్థిక కూటమిగా పనిచేయాలని సీఎం విజయ్ ఆకాంక్షించారు. బెంగళూరులోని బొమ్మసంద్ర నుంచి హోసూర్ వరకు మెట్రో రైలు విస్తరణను స్వాగతించిన ఆయన, ఇది అంతర్రాష్ట్ర సహకారానికి ఒక నమూనా అని అభివర్ణించారు. ఈ పనులను వేగవంతం చేయాలని అధికారులను కోరారు. 'డ్రగ్స్ రహిత దక్షిణ భారతం' కోసం మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై నిఘా సమాచారాన్ని పంచుకుంటూ, కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో మందుల విక్రయాలపై నియంత్రణ, అనధికార పంపిణీపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సముద్ర తీరంతో అభివృద్ధి

దక్షిణాది అభివృద్ధిలో బ్లూ ఎకానమీకి ప్రాధాన్యత ఇవ్వాలని విజయ్ అన్నారు. 1,076 కిలోమీటర్ల తీరప్రాంతం ఉన్న తమిళనాడు.. పోర్టులు, తీరప్రాంత నౌకాయానం, మత్స్య పరిశ్రమ, సముద్ర ఆధారిత పరిశ్రమలు, పర్యాటకం వంటి రంగాల్లో ఇతర రాష్ట్రాలతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఆర్థిక సమాఖ్య విధానంపై మాట్లాడుతూ.. రాబోయే ఫైనాన్స్ కమిషన్ నిధుల కేటాయింపులో రాష్ట్రాల అవసరాలు, పనితీరు రెండింటినీ పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు. జనాభా నియంత్రణలో విజయవంతమైన రాష్ట్రాలకు నష్టం జరగకూడదని, జీఎస్టీ తర్వాత పన్ను రేట్లను నిర్ణయించుకునే స్వేచ్ఛ రాష్ట్రాలకు ఉండాలని అన్నారు.

నీట్, నదీ జలాలపై స్పష్టమైన వైఖరి

అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల్లో కోర్టు తీర్పులు, ట్రైబ్యునల్ అవార్డులను అమలు చేయడం ద్వారా దిగువ రాష్ట్రాల హక్కులను కాపాడాలని విజయ్ డిమాండ్ చేశారు. కావేరీ జలాల విషయంలో ఆదేశాలను సకాలంలో అమలు చేయాలని, ముల్లపెరియార్ డ్యామ్ భద్రత, నీటి నిల్వను 152 అడుగులకు పెంచే అంశం న్యాయస్థానాల నిర్ణయాల మేరకే జరగాలని స్పష్టం చేశారు. నీట్ పరీక్షపై తమిళనాడు వ్యతిరేకతను పునరుద్ఘాటించిన ఆయన.. ఇది గ్రామీణ, పేద విద్యార్థులకు నష్టం చేస్తుండటంతో రాష్ట్ర కోటాలోని మెడికల్, డెంటల్, ఆయుష్ సీట్లను 12వ తరగతి మార్కుల ఆధారంగా భర్తీ చేసేందుకు అనుమతించాలని కేంద్రాన్ని కోరారు. జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన కారణంగా డీలిమిటేషన్ ప్రక్రియలో ఏ రాష్ట్రం కూడా పార్లమెంటరీ ప్రాతినిధ్యాన్ని కోల్పోకుండా చట్టపరమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. "బలమైన రాష్ట్రాలతోనే దేశం బలోపేతమవుతుంది. విభేదాలను చర్చలు, పరస్పర గౌరవం, చట్ట పాలన ద్వారా పరిష్కరించుకోవడానికి తమిళనాడు సిద్ధంగా ఉంది" అని ఆయన చెప్పుకొచ్చారు.

# సజ్జల రామకృష్ణారెడ్డిపై సంగం డెయిరీ పరువు నష్టం కేసు

రామకృష్ణారెడ్డిపై పరువు నష్టం కేసు దాఖలు చేసింది. తిరుమల తిరుపతి దేవస్థానానికి (టీటీడీ) సంగం డెయిరీ నెయ్యి సరఫరా చేస్తోందని, అయితే పాల సేకరణ చేయకుండానే నెయ్యి సరఫరా చేస్తున్నారంటూ సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన ఆరోపణలను సంగం డెయిరీ తీవ్రంగా ఖండించింది. వాస్తవాలను కప్పిపుచ్చి తమ సంస్థ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా తప్పుడు ఆరోపణలు చేశారని పిటిషన్‌లో పేర్కొంది. చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాల్లో సంగం డెయిరీ రైతుల నుంచి ఆవుపాలను సేకరిస్తోందని, అందుకు సంబంధించిన వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకుండా ఆరోపణలు చేశారని తెలిపింది. టీటీడీకి నెయ్యి సరఫరా విషయంలో భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేశారని సంగం డెయిరీ ఆరోపించింది. ఈ వ్యవహారంపై సంగం డెయిరీ ఎండీ గోపాలకృష్ణన్ గుంటూరు కోర్టులో పరువు నష్టం కేసు దాఖలు చేశారు. సజ్జల రామకృష్ణారెడ్డితో పాటు ఆరోపణలు చేసిన ఎమ్మెల్సీ తూమాటి మాధవరావుపైనా కేసు నమోదు చేయాలని కోరారు. అలాగే సజ్జల చేసిన వ్యాఖ్యలను ప్రసారం చేసిన సాక్షి టీవీతో పాటు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌పైనా కేసు దాఖలు చేసినట్లు తెలిపారు.

# అమరావతిలో ఎంట్రీకి అందుబాటులోకి రానున్న మరిన్ని రహదారులు..

(స్టీల్ బ్రిడ్జి – మణిపాల్ హాస్పిటల్) పనులు కూడా త్వరగా ప్రారంభించాలని అధికారులకు మంత్రి నారాయణ సూచించారు. సీడ్ యాక్సెస్ రోడ్డుకు సమాంతరంగా కరకట్టను వెడల్పు చేస్తూ ప్రకాశం బ్యారేజీ వరకూ E 1 రోడ్డును నిర్మిస్తున్నారు. ఆయా రోడ్ల నిర్మాణాలకు అవసరమైన రైల్వే ఇతర అనుమతులు దాదాపు కొలిక్కి వచ్చాయని మంత్రి నారాయణ దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. రోడ్ల పనులకు ఆటంకాలు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా కలెక్టర్‌ను ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశానికి సీఆర్డీఏ కమిషనర్ విజయరామరాజు, అడిషనల్ కమిషనర్ కార్తీక్, గుంటూరు జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మతోపాటు వివిధ శాఖల ఇంజినీర్లు హాజరయ్యారు.

# నా కుమార్తె వ్యాఖ్యలు పూర్తిగా వ్యక్తిగతం

అభిప్రాయాలకు మరొకరిని బాధ్యులను చేయడం సముచితం కాదని, అది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని ఈ సందర్భంగా సురేఖ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం, పీసీసీ నాయకత్వం, పార్టీ క్రమశిక్షణా నియమావళిపై తనకు సంపూర్ణమైన గౌరవం, విశ్వాసం ఉన్నాయని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో తన ప్రమేయం ఏమాత్రం లేదని... ప్రజాస్వామ్య విలువలు, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని తనకు జారీ చేసిన షోకాజ్ నోటీసును ఉపసంహరించుకోవాలని కమిటీకి విజ్ఞప్తి చేశారు.

# ఏపీలో మిలాద్-ఉన్-నబి సెలవు తేదీ మార్పు..

సెలవు తేదీని సవరించాలని వక్ఫ్ బోర్డు సీఈఓ చేసిన విజ్ఞప్తి మేరకు సెలవు తేదీని సవరిస్తూ నిర్ణయం తీసుకుంది. ఆగస్టు 26ను సాధారణ సెలవు దినంగా ప్రకటిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జె. శ్యామల రావు అధికారికంగా జీవో జారీ చేశారు.

# 'వందేమాతరం'పై కాంగ్రెస్ నిర్ణయం దేశాన్ని అవమానించడమే

తీసుకున్న ఈ నిర్ణయం కేవలం రాజకీయ నిర్ణయం కాదని, దేశ ప్రజల మనోభావాలకు సంబంధించిన అంశమని అమిత్‌షా పేర్కొన్నారు. 'వందేమాతరం'పై కాంగ్రెస్ తీసుకున్న వైఖరికి వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు.

భారత్ విభజనకు కాంగ్రెస్ విధానాలే కారణం

కాంగ్రెస్ గతంలో అనుసరించిన సంతుష్టీకరణ విధానాల వల్లే దేశం రెండు ముక్కలైందని అమిత్‌షా ఆరోపించారు. గతంలో చేసిన తప్పుల నుంచి కాంగ్రెస్ ఎలాంటి పాఠాలు నేర్చుకోలేదని విమర్శించారు. 'వందేమాతరం' విషయంలోనూ అదే విధానాన్ని కొనసాగిస్తోందని అమిత్‌షా ఆగ్రహం వ్యక్తం చేశారు.

# అసెంబ్లీకి రాకుండా పారిపోతున్న జగన్

రాకుండా పారిపోతున్నారంటూ జగన్‌కు చురకలంటించారు పరీక్షల వ్యవస్థపై అవగాహన లేని వ్యక్తి ఇప్పుడు ప్రశ్నలు లేవనెత్తుతున్నారంటూ జగన్‌పై మంత్రి లోకేశ్ నిప్పులు చెరిగారు. డీఎస్సీ, ఏపీపీఎస్సీ మధ్య తేడా తెలియని వైఎస్ జగన్‌కు పరీక్షలపై మాట్లాడే అర్హత ఉందా? అంటూ ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు మంత్రి లోకేశ్ తన ఎక్స్ ఖాతా వేదికగా జగన్‌కు కౌంటర్ ఇచ్చారు.

# మోదీ, అమిత్ షాల రాజకీయ అధ్యాయం ముగిసింది

కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలపై మరోసారి విమర్శలు గుప్పించారు. ఎన్డీయేలో బీజేపీ రాజకీయ ఆధిపత్యం క్షీణించిందని... మోదీ, అమిత్ షా రాజకీయ ప్రయాణం ముగిసిపోయిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కేంద్రంలో బీజేపీకి స్వతంత్రంగా మెజారిటీ లేకపోవడం వల్ల ఆ పార్టీ రాజకీయ శక్తి, పట్టు పూర్తిగా తగ్గిపోయాయని ఆయన విమర్శించారు. గతంలో చూపిన రాజకీయ ఆధిపత్యాన్ని మోదీ, అమిత్ షా జోడీ ఇప్పుడు కోల్పోయిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్షంగా కాంగ్రెస్ పార్టీ, 'ఇండియా' కూటమి మరింత వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని వెల్లడించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల సమస్యలపై పోరాటాన్ని మరింత తీవ్రతరం చేయాలని, రాబోయే సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

# వికసిత్ భారత్ నిర్మాణంలో దక్షిణాది ప్రాంతం కీలక ఆర్థిక శక్తిగా ఎదగాలి

గుర్తు చేశారు. 2047 నాటికి దక్షిణాది ఆర్థిక వ్యవస్థ 10 ట్రిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు. విభజన చట్టంలోని షెడ్యూల్ 9,10 సంస్థలు.. 12 ఏళ్లుగా ఇంకా విభజనకు నోచుకోలేదన్నారు. విభజన సమస్యల పరిష్కారానికి వేగంగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. పోలవరం, సౌత్ కోస్ట్ రైల్వే జోన్, అమరావతి ప్రాజెక్టులు కేంద్ర సహకారంతో సాకారం అవుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. రాజధాని అమరావతికి చట్టబద్ధ రాజధాని హోదా సాధించామని ఈ సందర్భంగా ఏపీ సీఎం గుర్తు చేశారు. వనరుల లోటు, సెక్షన్ 56లోని అంశాలను పరిష్కరించాలనీ కేంద్రాన్ని ఆయన కోరారు. దుగ్గరాజుపట్నం పోర్టు, రిఫైనరీ ప్రతిపాదనలకు వేగంగా అనుమతులు ఇవ్వాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వాలని కేంద్రానికి స్పష్టం చేశారు. అలాగే కడప జేఎస్‌డబ్ల్యూ రైల్వే లింక్‌కు కూడా కేంద్ర అనుమతులు మంజూరు చేయాలన్నారు. గోదావరి–కావేరి నదుల అనుసంధానంతో 500 టీఎంసీలకుపైగా నీటిని మళ్లించే ప్రతిపాదన ఉందన్నారు. గోదావరి – కావేరి అనుసంధానంతో తమిళనాడు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారమని ఆయన అభిప్రాయపడ్డారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు కలిసి నదీ జలాలపై సమన్వయంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. గంగా – కావేరి నదుల అనుసంధానానికి దీర్ఘకాలిక జాతీయ ప్రణాళిక ఆవశ్యకతను ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు వివరించారు. నదుల అనుసంధానంపై కాలపరిమితితో కూడిన డీపీఆర్‌లు, అనుమతులు ఇవ్వాలని కేంద్రాన్ని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు కోరారు. సహకారం, సమన్వయంతోనే దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి సాధ్యమని సీఎం చంద్రబాబు విశ్వాసం వ్యక్తం చేశారు. 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగాన్ని దక్షిణాది రాష్ట్రాల సీఎంలు కొనియాడారు. దక్షిణాది రాష్ట్రాల సమగ్రాభివృద్ధి గురించి ఎంతో విజన్‌తో సీఎం చంద్రబాబు మాట్లాడారని ఈ సమావేశంలో పాల్గొన్న పలువురు ముఖ్యమంత్రులు పేర్కొన్నారు.

# రండి, ఆగస్టు 26న శ్రీగిరి గిరిప్రదక్షిణ చేద్దాం

## భక్తులకు శ్రీగిరి గిరిప్రదక్షిణ కమిటీ పిలుపు

ఒంగోలు, నేటి శుభోదయ : శ్రావణమాసం శుక్ల త్రయోదశి, ఆగస్టు 26వ తేదీ బుధవారం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి జన్మ నక్షత్రం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని, ఓణం పర్వదినమున శ్రీగిరి గిరి ప్రదక్షిణ కమిటీ ఆధ్వర్యంలో శ్రీగిరి ప్రదక్షిణ కార్యక్రమం అత్యంత భక్తియుతంగా, శోభాయమానంగా జరుగుతుందని శ్రీగిరి గిరిప్రదక్షిణ కమిటీ అధ్యక్షులు రాధా రమణ గుప్తా జంధ్యం తెలిపారు. శ్రీగిరి గిరిప్రదక్షిణ కమిటీ కార్యవర్గ సమావేశములో వారు మాట్లాడుచూ ఉదయం 5 గంటలకు శ్రీగిరి పాదపీఠం వద్దగల శ్రీ బాపూజీ గోశాల వద్ద గోపూజ నిర్వహించి భక్తులందరూ సామూహికంగా గోవింద నామస్మరణ చేస్తూ సుందరంగా అలంకరించిన పల్లకిలో శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వార్ల ఉత్సవమూర్తులను వేంచేపు చేసి భక్తులు తమ భుజస్కంధాలపై పల్లకి మోస్తూ శ్రీగిరి గిరి ప్రదక్షిణ నగరోత్సవం చేయడం జరుగుతుందని తెలిపారు. ఇంతటి మహిమాన్వితమైన రోజున సకుటుంబ సపరివార సమేతంగా సామూహికముగా శ్రీవారి నామస్మరణ చేస్తూ శ్రీగిరి గిరి ప్రదక్షిణ చేసి స్వామివార్ల కృపకు పాత్రులు కావాల్సిందిగా కమిటీ అధ్యక్షులు రాధా రమణ గుప్తా జంధ్యం తెలిపారు. స్వామివారి నక్షత్రం రోజున



సామూహికంగా భక్తి ప్రపత్తులతో శ్రీగిరి గిరిప్రదక్షిణ చేసి శ్రీవారిని దర్శించుకోవడంతో శారీరక మానసిక స్థితి మెరుగై ఆరోగ్యం సిద్ధిస్తుందని, హిందూ సంప్రదాయాలు తెలుస్తాయని, ఐక్యత బలపడుతుందని వివరించారు. సమావేశంలో అధ్యక్షులు రాధా రమణ గుప్తా జంధ్యం, ఉపాధ్యక్షులు తూనుగుంట మల్లికార్జున రావు, దాసరి నారాయణరావు, కార్యదర్శి త్రిపురం మల్లికార్జునరావు, సహ కార్యదర్శి నేరెళ్ల శ్రీనివాసరావు, కోశాధికారి వలేటి కృష్ణారావు, సభ్యులు నూనె రామాంజనేయులు, ధనిశెట్టి రామునాయుడు, కనమర్లపూడి బాలకోటేశ్వరరావులు పాల్గొన్నారు.

# ఆధునిక శాస్త్ర, సాంకేతిక రంగాల్లో న్యూమెరికల్ ఎనాలసిస్, మెషిన్

## - లెర్నింగ్ పరస్పర సమన్వయం ద్వారా సమస్యలు పరిష్కరించవచ్చు

## -అసోసియేట్ ప్రొఫెసర్ సుకంట నాయక్






విజయవాడ, ఆగస్టు 20 నేటి శుభోదయ : ఆధునిక శాస్త్ర, సాంకేతిక రంగాల్లో న్యూమెరికల్ ఎనాలిసిస్, మెషిన్ లెర్నింగ్ పరస్పర సమన్వయం ద్వారా క్లిష్టమైన గణిత సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించవచ్చని విట్ -ఎ.పి. యూనివర్ సిటీ,అమరావతి స్కూల్స్ ఆఫ్ అడ్వాన్స్ సైన్స్, డిపార్ట్మెంట్ ఆఫ్ మేధమెటిక్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సుకంట నాయక్ అన్నారు. గురువారం శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలలో గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఇంటిగ్రెటింగ్ న్యూమెరికల్ ఏనాలసిస్ మెషిన్ లెర్నింగ్ అంశం పై నిర్వహించిన జాతీయ సదస్సులో పాల్గొని మాట్లాడుతూ ముఖ్యంగా డేటా విశ్లేషణ, గణిత నమూనాల రూపకల్పన, అంచనా పద్ధతులు, శాస్త్రీయ మరియు ఇంజనీరింగ్ అనువర్తనాల్లో మెషిన్ లెర్నింగ్ ప్రాధాన్యతను వివరించారు. గణితశాస్త్ర విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని గణితశాస్త్రంలో అనుసంధానం చేసుకొని పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించుకోవాలని ఆయన సూచించారు.

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్, గణితశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పి.వి. దుర్గావతి మాట్లాడుతూ గణితశాస్త్రాన్ని ఆధునిక సాంకేతిక రంగాలలో అనుసంధానం చేస్తే ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో పరిశోధనా ఆసక్తిని, నూతన ఆలోచనా విధానాన్ని పెంపొందించడానికి ఎంతో దోహదపడతాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో బి. కీరణ్మయి, కే. భానుప్రియ, డాక్టర్ వై. సరూప, ఎన్. జాహ్నవి దేవి, కె. తబిత, వి. పుష్ప, గణిత విద్యార్థినులు పాల్గొన్నారు.

# హెల్మెట్ వాడండి ప్రాణాలను రక్షించుకోండి

## -అవగాహన కల్పించిన గుడివాడ ట్రాఫిక్ పోలీసులు



గుడివాడ, ఆగష్టు 20 నేటి శుభోదయ: ప్రతి ఒక్కరు తప్పని సరిగా హెల్మెట్ వాడాలని, హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదభరితమైనదని గుడివాడ ట్రాఫిక్ ఎస్. ఐ. పి. నాగరాజు అన్నారు. గురువారం బంటుమిల్లి రోడ్డులో వాహనదారులకు హెల్మెట్ ధరించడం పై అవగాహన కల్పించిన అనంతరం మాట్లాడుతూ ద్విచక్రవాహనం నడిపేటప్పుడు హెల్మెట్ వినియోగించడం వలన ప్రమాదం జరిగినప్పుడు తలకు గాయం కాదని, హెల్మెట్ పెట్టకపోవడం వలన ప్రమాదం జరిగితే తలకు తగిలే గాయం వలన ప్రాణాలు పోయే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. అలాగే వేగంగా బైక్ ను నడపడం ద్వారా జరిగే ప్రమాదాలు కూడా తీవ్రంగా ఉంటాయని, వేగంగా నడిపే సమయంలో ఇంటిలో ఉన్న వారి గురించి కూడా ఆలోచించితే వాహనాన్ని వేగంగా నడపరని అన్నారు. ముగ్గురు బైక్ మీద కూర్చడం వలన కూడా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఇద్దరు బైక్ పై ప్రయాణం మంచిదన్నారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ తప్పని కలిగి ఉండాలని, వాహనాలకు సంబంధించిన డాక్యుమెంట్స్ ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని,వాహనం నడిపేటప్పుడు సెల్ఫోన్ డ్రైవింగ్ చేయరాదని హెచ్చరించారు. అలాగే వాహనాలతో రాంగ్ రూట్లో వెళ్లడం, రాంగ్ పార్కింగ్ చేయరాదని, మైనర్లకు వాహనాలు ఇవ్వరాదన్నారు. అంతేకాకుండా మితిమీరిన వేగంతో నడపడం వలన ప్రమాదాలు సంభవించి ప్రాణాలు పోగొట్టుకునే దాని కంటే నిదానమే ప్రధానమనే నినాదాన్ని పాటిస్తే ప్రసాద్ ప్రమాదాలు తగ్గుతాయన్నారు. మితిమీరిన వేగంగా నడిపే వారి విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

# బీసీలకు 33 శాతం పైగా రిజర్వేషన్లపై గుడివాడ జనసేన హర్షం

## -సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ధన్యవాదాలు: గుడివాడ జనసేన అధ్యక్షుడు మజ్జి శ్రీనివాస్, బిసి సెల్ నాయకులు

## -ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో బీసీలకు అండగా ఉంటామన్న నాయకులు

గుడివాడ, ఆగష్టు 20 నెట్ శుభోదయ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 33 శాతం పైగా రిజర్వేషన్లు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై జనసేన బీసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బీసీల రాజకీయ, సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి ఈ నిర్ణయం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. గుడివాడ సత్యనారాయణపురంలోని జనసేన పార్టీ కార్యాలయంలో గుడివాడ జనసేన పార్టీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాస్‌తో పాటు బీసీ సెల్ నాయకులు పాత్రికేయులతో మాట్లాడారు. బీసీలకు స్థానిక ఎన్నికల్లో 33 శాతం పైగా రిజర్వేషన్లు కల్పించే నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు జనసేన నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూశారని నాయకులు విమర్శించారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి, ఆచరణలో మాత్రం బీసీ వర్గాలకు తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలకు అన్ని రంగాల్లో సముచిత ప్రాధాన్యత కల్పిస్తూ ముందుకు సాగుతోందని జనసేన నాయకులు అన్నారు. ముఖ్యంగా స్థానిక సంస్థల్లో బీసీల రాజకీయ ప్రాతినిధ్యం పెరిగేలా 33 శాతం పైగా రిజర్వేషన్లు కల్పించడం చారిత్రాత్మక నిర్ణయమని



మధ్య శ్రీనివాస్ మరియు నాయకులు పేర్కొన్నారు. జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో బీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని నాయకులు తెలిపారు. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో గుడివాడ నియోజకవర్గంలో బీసీ వర్గాల అభ్యున్నతికి మరింత కృషి చేస్తామని స్పష్టం చేశారు.బీసీలకు రాజకీయంగా మరింత ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు, విద్య, ఉపాధి, సంక్షేమం, ఆర్థికాభివృద్ధి రంగాల్లో వారికి అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని జనసేన బీసీ నాయకులు పేర్కొన్నారు.

మీడియా సమావేశంలో సుంకర వెంకట్ ,లోయ రాజా , పోలుకొండ వెంకటేశ్వరరావు,జాజుల సురేష్, నరసయ్య, గేదెల గణేష్, గులివెందుల శ్రీనివాసరావు,గేదెల కల్యాని,కనకదుర్గా తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

# కులమతాలకు అతీతంగా 'కంబాల' బంగారు వరలక్ష్మి కానుక...!!

## - లక్కీడ్రాలో గెలిపొందిన 230 మంది మహిళలకు బంగారు రూపులు, పంపిణీ చేసిన 'కంబాల' దంపతులు..!

## - వెయ్యి మందికి పట్టు చీరలు పంపిణీ...!










రాజానగరం,(కోరుకొండ) ఆగస్టు 20, నేటి శుభోదయ : తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మాధవి ఫంక్షన్ హల్ లో రామసేన అధ్యక్షులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం రెండోవ రోజు రాజానగరం మండలానికి చెందిన నరేంద్రపురం, నందరాడ, సీతారాంపురం, పల్లకడియం, భూపాలపట్నం, ముక్కనాడ, కొత్త వెలుగుబంధ, పాత వెలుగుబంధ గ్రామాలకు సంబంధించి, నిర్వహించిన, బంగారు వరలక్ష్మి కానుక సీజన్-4 లక్కీడ్రా కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి భారీగా మహిళలు, తరలివచ్చి పాల్గొన్నారు. తొలిత కంబాల శ్రీనివాసరావు, దంపతులకు స్థానికులు, పార్టీ నాయకులు, పలు ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పూలవర్షం కురిపిస్తూ స్వాగతం పలికి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం కంబాల శ్రీనివాసరావు, శ్రీమతి పద్మావతి దేవి గంగారత్నం దంపతులకు అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి, వేదమంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనాలు అందించారు. అనంతరం వరలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన, కంబాల దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి, జాతీయ గీతాలాపనతో కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ శ్రావణమాసంలో ప్రతి పేద మహిళ ఆనందంగా వరలక్ష్మి వ్రతాన్ని జరుపుకోవాలనే సంకల్పంతోనే బంగారు వరలక్ష్మి కానుక కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. భారతీయ జనతా పార్టీలో నేను కార్యకర్తగా సేవ చేశానని, మూడు నెలల క్రితం రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ ఆదేశాల మేరకు జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1గా నియమించడం జరిగిందన్నారు.

బీఎల్ఏ-1 నియామకం అనంతరం 248 మంది బీఎల్ఏ-2లను నియమించి, సర్ ప్రకీయ సమర్థవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఇటీవలే రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా కూడా నియమించడం జరిగిందన్నారు గత నెల 11వ తేదీ నుంచి పలు గ్రామాలలో దాదాపుగా ఇప్పటి వరకు 85,000 పట్టుచీరలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం లక్ష పట్టు చీరలు పంపిణీ చేయాలని సంకల్పించడం జరిగిందన్నారు. అలాగే జగ్గంపేట, రాజానగరం రంపచోడవరం నియోజకవర్గలో ఈ ఏడాది 4,000 బంగారు రూపులు పంపిణీ చేస్తామన్నారు. అనంతరం నిర్వహించిన లక్కీడ్రాలో కులమతాలకతీతంగా గెలిపోందిన 230 మంది మహిళలకు బంగారు రూపులు, పట్టుచీరలను కంబాల శ్రీనివాసరావు దంపతులు ఉచితంగా పంపిణీ చేసారు. అలాగే 1,000 మంది మహిళలకు పట్టు చీరలను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోస్టర్ పెయింటింగ్ పోటీలు






చింతూరు, నేటి శుభోదయ :చింతూరు లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో, ఆగస్ట్ 23 న జరగబోయే జాతీయ అంతరిక్ష దినోత్సవ సందర్భంగా పోస్టర్ పెయింటింగ్ ను నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.మణిమాల తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపల్, భౌతిక శాస్త్ర విభాగాధిపతి ముల్లి శేఖర్ మాట్లాడుతూ భారతదేశం అంతరిక్ష రంగంలో సాధించిన అద్భుత విజయాలు, ఉపగ్రహ సాంకేతికత, చంద్రయాన్ ప్రయోగాలు, భారత శాస్త్రవేత్తల కృషి గురించి, చంద్రయాన్ -3 విజయాన్ని ప్రస్తావిస్తూ, భారతదేశానికి ప్రపంచవ్యాప్తంగా గొప్ప గౌరవాన్ని తీసుకువచ్చిందన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులకు అవగాహన పెంపొందించుటకు పోస్టర్ పెయింటింగ్ పోటీలను నిర్వహించారు . ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ వై.పద్మ, డాక్టర్ జి.జాన్సీ, ఆర్. మౌనిక, జి. సాయికుమార్, బి. శ్రీనివాసరావు, కె. లక్ష్మీ ప్రసన్న, కె. కీర్తి, ఆర్. కిరణ్మయి, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ**





అనంత పురం బ్యూరో ఆగస్టు 20 నేటి శుభోదయ : అనంతపురం నగరం లోనే ఎంపీ క్యాంప్ కార్యాలయం నందు జిల్లాలోనే పలు ప్రాంతాల నుంచి అనేకమంది ప్రజల తమ సమస్యలను పరిష్కరించాలని ఎంపీ కి అర్జీలను సమర్పించి సమస్యను తెలియజేశారు. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సంబంధిత అధికారులను ఫోన్ ద్వారా సమస్యను తెలియజేసి సత్వరవే పరిష్కరించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్, విద్య, పంచాయతీ, దేవాదాయ, విద్యుత్ శాఖ తదితర అధికారులతో మాట్లాడి సత్వరం పరిష్కరించాలని తెలియజేశారు. సమస్యల పరిష్కరించడానికి చంద్రబాబునాయుడు ప్రత్యేక గ్రీవెన్స్ ను ప్రవేశపెట్టారని ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులకు విన్నవించారు. కార్యాలయంలో జిల్లాలోనే వివిధ సంఘాల నాయకులు, వివిధ సంస్థల ప్రతినిధులు ఎంపీ ని కలిసి తమ సమస్యలను తెలియజేశారు. సమస్యలను పరిష్కరించడానికి అందరూ కలిసి కృషి చేద్దామని తెలియజేశారు. పోస్టల్ శాఖ ప్రజల్లో మరిన్ని సేవలు విస్తరించాలని ఈ సందర్భంగా అధికారుల సమావేశంలో తెలియజేశారు. పోర్షన్ శాఖ మరింత సమర్థవంతంగా పనిచేయడానికి తమ వంతుగా కృషి చేస్తానని, ఏవైనా సమస్యలు ఉంటే మంత్రి తమ దృష్టికి వచ్చిన వాటిని కేంద్ర మంత్రి తెలియచేసి సత్వరం పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు.

# సత్యసాయి త్రాగునీటి ప్రాజెక్టు కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలి

**- ప్రాజెక్టు నిర్వహణను ఎల్అండ్‌టీ లేదా ఆర్‌డీటీ సంస్థకు అప్పగించాలి**

**- అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరిన పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి**



అనంత పురం బ్యూరో ఆగస్టు 20 నేటి శుభోదయ సత్యసాయి త్రాగునీటి ప్రాజెక్టు కింద పనిచేస్తున్న కార్మికులకు నెలసరి వేతనాలు సక్రమంగా మంజూరు చేసి, ప్రజలకు త్రాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ అంశాన్ని అసెంబ్లీలో ప్రత్యేకంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీటిని అందించాలనే ఉద్దేశంతో పుట్టపర్తి భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 1997లో సత్యసాయి త్రాగునీటి ప్రాజెక్టును ప్రారంభించారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ ప్రాజెక్టు పరిధిలో 273 వ్యక్తిగత స్కీమ్‌లు, 19 వివిధ స్కీమ్‌లు, మరో 5 ఇతర స్కీమ్‌లు ఉన్నాయని చెప్పారు.సత్యసాయి త్రాగునీటి ప్రాజెక్టు ద్వారా సుమారు 1,341 గ్రామాలకు, దాదాపు 16.40 లక్షల మంది ప్రజలకు త్రాగునీరు అందుతోందని వివరించారు. ఇంతటి కీలకమైన ప్రాజెక్టు నిర్వహణలో పనిచేస్తున్న సుమారు 576 మంది కార్మికులకు ఐదు నెలలుగా వేతనాలు అందకపోవడం ఆందోళనకరమన్నారు. వేతనాలు అందకపోవడంతో కార్మికులు, వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అదే సమయంలో కార్మికుల కొరతతో ప్రాజెక్టు నిర్వహణ, ప్రజలకు త్రాగునీటి సరఫరాపై కూడా ప్రభావం పడుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.కార్మికుల వేతనాల కోసం నెలకు సుమారు రూ.1.30 కోట్లు, ప్రాజెక్టు నిర్వహణ, మెయింటెనెన్స్ కోసం మరో రూ.50 లక్షలు అవసరమవుతున్నాయని తెలిపారు. గతంలో ఎల్అండ్‌టీ సంస్థ ద్వారా కార్మికులకు వేతనాలు సక్రమంగా చెల్లించేవారని గుర్తు చేశారు.ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సత్యసాయి త్రాగునీటి ప్రాజెక్టు నిర్వహణను తిరిగి ఎల్అండ్‌టీ సంస్థకు లేదా ఆర్‌డీటీ సంస్థకు అప్పగించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని కోరారు. లేదా ప్రభుత్వం ద్వారా తగిన ఏజెన్సీని ఏర్పాటు చేసి కార్మికులకు ప్రతినెలా వేతనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.సత్యసాయి త్రాగునీటి ప్రాజెక్టు లక్షలాది మంది ప్రజల త్రాగునీటి అవసరాలను తీర్చే అత్యంత కీలకమైన ప్రాజెక్టు అని, దీనిని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కోరారు.

# విద్యార్థులకు మధ్యాహ్న భోజన ప్లేట్ల పంపిణీ




మాచర్ల: ఆర్ సి ఇన్చార్జ్ ఆగస్టు 20;నేటి శుభోదయ మాచర్ల పట్టణంలోని బాయ్స్ జెడ్పీ హైస్కూల్‌లో వికసిత్ భారత్ సోషల్ అండ్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం కోసం ప్లేట్లను పంపిణీ చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రతను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మాచర్ల పట్టణ అధ్యక్షుడు, ట్రస్ట్ రాష్ట్ర కన్వీనర్ ఓర్సు క్రాంతి కుమార్ తెలిపారు. విద్యార్థుల సంక్షేమం కోసం భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ అలీ సురేష్, జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు, ట్రస్ట్ ఫౌండర్ శివ కోటయ్య నాయక్, భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు బొగ్గవరపు మస్తాన్రావు, పోకూరి కాశీపతి, పట్టణ ప్రధాన కార్యదర్శి సురేష్ బాబు, పట్టణ ఉపాధ్యక్షుడు వరకవి నాగరాజు, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు పాల్తి వెంకటేశ్వర నాయక్, ఏబీవీపీ నాయకుడు కనక కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# చెన్నారెడ్డి పెద్దకర్మ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నేతల హాజరు



రెంటచింతల: ఆర్ సిఇంచార్జ్ ఆగస్టు 20; నేటి శుభోదయ : మండలంలోని రెంటాల గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు నవులూరి భాస్కర్‌రెడ్డి కుమారుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం కన్వీనర్ నవులూరి చెన్నారెడ్డి పెద్దకర్మ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు జక్కంపూడి రాజా, వైఎస్సార్‌సీపీ యువ నాయకులు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి పాల్గొని చెన్నారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చెన్నారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆళ్ల రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎస్ఈసీ సభ్యులు కొమ్మారెడ్డి చలమారెడ్డి, సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధులు కారుమూరు వెంకటరెడ్డి, శ్యామల, మాచర్ల నియోజకవర్గ పరిశీలకులు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కె.వి.), పెదకూరపాడు నియోజకవర్గ పరిశీలకులు యెనుముల మురళీధర్‌రెడ్డి, గురజాల నియోజకవర్గ పరిశీలకులు పడాల శివారెడ్డితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చెన్నారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని నాయకులు ప్రార్థించారు.

# పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ సాధ్యం

**- లయన్స్ క్లబ్ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి**



యాడికి ఆగస్టు 20 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : భావి తరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణను ఒక బాధ్యతగా స్వీకరించాలని రాయలచెరువు లయన్స్ క్లబ్ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి పిలుపునిచ్చారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం రాయలచెరువు గ్రామంలో పర్యావరణ పరిరక్షణ వారోత్సవాలు/కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రజలకు ఉచితంగా మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టాలంటే విస్తృతంగా చెట్లను పెంచడమే ఏకైక మార్గమని అన్నారు. ప్రతి ఇంట్లోనూ కనీసం ఒక చెట్టును నాటి, దానిని సంరక్షిస్తే గ్రామానికి మంచి ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు పరిశుభ్రమైన ఆక్సిజన్ (ప్రాణవాయువు) లభిస్తుందని వివరించారు. పచ్చదనంతోనే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుంటుందని, మున్ముందు కూడా గ్రామాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా మరిన్ని సేవ కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. ప్రజలంతా ఈ మొక్కల పెంపకంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ట్రెజరర్ రామకృష్ణతో పాటు ముఖ్య నాయకులు చల్లా సూర్యనారాయణ, రవి కుమార్ రెడ్డి, మాదాల ప్రసాద్, మురళీకృష్ణ, సుబ్బారెడ్డి, గ్రామ ప్రముఖులు, క్లబ్ సభ్యులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# భూకబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి



మాచర్ల, ఆగస్టు 20: భూకబ్జాదారులపై కఠినమైన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని పాలకుర్తి పెద్ద వెంకటేశ్వర్లు కోరారు. మాచర్ల రింగ్‌రోడ్డు సమీపంలోని సర్వే నంబర్ 1072లో 1.79 సెంట్ల భూమి తమ పూర్వీకుల నుంచి సంక్రమించిందని, అందుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ దస్తావేజులు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. అయితే కొందరు వ్యక్తులు నకిలీ దస్తావేజుల ఆధారంగా తమ భూమిని కబ్జా చేసేందుకు గతంలో పలుమార్లు ప్రయత్నించారని ఆరోపించారు. ప్రస్తుతం తమ భూమిలో నివాసం ఏర్పాటు చేసుకునేందుకు ప్రయత్నిస్తుండగా, అకారణంగా కేసులు పెట్టి తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో భూమికి సంబంధించిన దస్తావేజులను పరిశీలించి, వాస్తవాలను నిర్ధారించి తమకు న్యాయం చేయాలని హ్యూమన్ రైట్స్ ప్రొటెక్ట్ వెల్ఫేర్ అవేర్‌నెస్ ఆర్గనైజేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షులు గురజాల అప్పారావును ఆశ్రయించి అర్జీ సమర్పించారు. అర్జీతో పాటు సమర్పించిన పత్రాలను పరిశీలించిన గురజాల అప్పారావు, ఈ విషయంపై పలువురు ఉన్నతాధికారులతో చర్చించి, వాస్తవాలను వెలికితీసి బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని తెలిపారు.

# "వసుధ " కు గిడుగు వారి సాహితీ సేవా పురస్కారం



గుడివాడ, ఆగష్టు 20 నేటి శుభోదయ : వ్యావహారిక భాషోద్యమ నాయకుడు గిడుగు రామమూర్తి జయంతి సందర్భంగా విజయవాడ లోని మల్లెతీగ సాహితీ సేవా సంస్థ పలువురు సాహితీ మూర్తులకు అందజేయ నున్న మల్లెతీగ - గిడుగు సాహితీ సేవా పురస్కారానికి గుడివాడ కు చెందిన కవి, రచయిత, జర్నలిస్ట్, విశ్రాంత యూనియన్ బ్యాంకు అధికారి వసుధ బసవేశ్వర రావు ను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు కలిమిశ్రీ తెలిపారు. వసుధ గత అయిదు దశాబ్దాలుగా సాహిత్య రంగంలో విశేష కృషి చేస్తున్నారు. ఈ నెల 23 వ తేదీన విజయవాడ బందరు రోడ్డు లోని ఠాగూర్ గ్రంథాలయంలో ఉదయం నుంచి జరగనున్న సృజనోత్సవ కార్యక్రమంలో " వసుధ " కు పురస్కారాన్ని అందజేయనున్నట్టు ఆయన తెలిపారు. ఇందులో వసుధ తో పాటు మరో తొమ్మిది మందికి ఈ సేవా పురస్కారాలను అందజేస్తారు.

# రెడ్ క్రాస్ సొసైటీ, తలసీమియా రోగుల రవాణా, రక్తదాన శిబిరాల నిర్వహణకు రూ.20 లక్షల విలువైన వాహనం అందజేత






అనంతపురం బ్యూరో ఆగస్టు 20 నేటి శుభోదయ: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అనంతపురం జిల్లా శాఖ ఆధ్వర్యంలో తలసీమియా వ్యాధిగ్రస్తుల రవాణా సౌకర్యంతో పాటు రక్తదాన శిబిరాల నిర్వహణకు ఉపయోగపడే రూ.20 లక్షల విలువైన టెంపో ప్రయాణ వాహనాన్ని హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త దాత శ్రీ శంకర్ నారాయణ ప్లాంజరీ బహూకరించారు. భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఈ వాహనాన్ని సేవా కార్యక్రమాలకు అంకితం చేశారు. ఈ వాహనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా రెవెన్యూ అధికారి శ్రీ ఏ. మలోలా, జేఎన్టీయూ అనంతపురం ఉపకులపతి ప్రొఫెసర్ హెచ్. సుదర్శన రావు, వాహన దాత శ్రీ శంకర్ నారాయణ ప్లాంజరీ, రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ గజ్జల లక్ష్మణ ప్రసాద్, వైస్ చైర్మన్ డాక్టర్ గీతా బాల, స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యులు బిసాతి భరత్, రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు, ఉప కమిటీ సభ్యులు, వాలంటీర్లు, రక్తదాన శిబిరాల నిర్వాహకులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాహన దాత శంకర్ నారాయణ ప్లాంజరీ మాట్లాడుతూ, డాక్టర్ గీతా బాల ద్వారా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అనంతపురం జిల్లా శాఖలో తలసీమియా డే కేర్ సెంటర్ ప్రారంభించబడిందని, తలసీమియా వ్యాధిగ్రస్తుల అవసరాల కోసం ఒక వాహనం అవసరమని తనకు తెలియజేయడంతో వెంటనే స్పందించి వాహనానికి అవసరమైన నిధులను సమకూర్చినట్లు తెలిపారు. రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ప్రత్యక్షంగా చూసిన అనంతరం తనకు ఎంతో సంతోషం కలిగిందని, తాను అందించిన విరాళం సక్రమంగా ప్రజాసేవకు వినియోగించబడుతోందనే పూర్తి విశ్వాసం కలిగిందని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా రెడ్ క్రాస్ చేపడుతున్న సేవా కార్యక్రమాలకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. అదేవిధంగా, అనంతపురంలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐ బ్యాంక్ సేవల్లో కూడా భాగస్వామి కావాలనే తన ఆకాంక్షను శ్రీ శంకర్ నారాయణ ప్లాంజరీ వ్యక్తం చేశారు. తన భార్య స్వర్గీయ రాజ్యలక్ష్మి ప్లాంజరీ ఇటీవల నేత్రదానం చేశారని, వారి నేత్రాలను ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి కి దానం చేసినట్లు తెలిపారు. ఇలాంటి నేత్రదాన సదుపాయం అనంతపురంలో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతపురం రెడ్ క్రాస్ ఐ బ్యాంక్‌లో కార్నియాలను శాస్త్రీయంగా పరిశీలించి, అవసరమైన వారికి అందించేందుకు ఉపయోగపడే స్పెక్యులర్ మైక్రోస్కోప్ కొనుగోలుకు అవసరమైన సుమారు రూ.40 లక్షల వ్యయాన్ని తానే భరిస్తానని ఈ సందర్భంగా శంకర్ నారాయణ ప్లాంజరీ హామీ ఇచ్చారు. దాత శ్రీ శంకర్ నారాయణ ప్లాంజరీ అందించిన ఈ సహకారంపై రెడ్ క్రాస్ జిల్లా కమిటీ హర్షం వ్యక్తం చేస్తూ, ఆయనకు రెడ్ క్రాస్ సంస్థతో పాటు సమాజం కూడా ఎంతో రుణపడి ఉంటుందని పేర్కొంది. స్పెక్యులర్ మైక్రోస్కోప్ అందుబాటులోకి వచ్చిన అనంతరం సేకరించిన కార్నియాలను శాస్త్రీయంగా పరీక్షించి, ముందుగా స్థానికంగా అవసరమైన వారికి అందించడంతో పాటు, అవసరానికి అనుగుణంగా హైదరాబాద్‌లోని ఎల్.వి. ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్, అగర్వాల్ నేత్ర హాస్పిటల్ తదితర ప్రముఖ నేత్ర వైద్య సంస్థలకు పంపించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ వాహనం ద్వారా తలసీమియా వ్యాధిగ్రస్తులకు రక్త మార్పిడి కోసం అవసరమైన రవాణా సౌకర్యం కల్పించడంతో పాటు, జిల్లాలో నిర్వహించే రక్తదాన శిబిరాలకు అవసరమైన సామగ్రి, సిబ్బంది ఇతర సేవలను సమర్ధవంతంగా తరలించేందుకు ఉపయోగపడనుంది. దీంతో అనంతపురం జిల్లాలో తలసీమియా రోగులకు, రక్తదాన శిబిరాల నిర్వహణకు మరింత మెరుగైన సేవలు అందుబాటులోకి రానున్నాయి. కార్యక్రమంలో రెడ్ క్రాస్ వాలంటీర్లు, యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రక్తదాన శిబిరాల నిర్వాహకులు, విద్యార్థులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# రూ.16 లక్షలతో కల్వర్ట్ ఆర్ సి సి పునర్నిర్మాణ పనులను పరిశీలించిన కమీషనర్ మనోహర్

గుడివాడ, ఆగష్టు 20 నేటి శుభోదయ : గుడివాడ--విజయవాడ ప్రధాన రహదారిలోని కవిరాజా కళామందిరం వద్ద ఇటీవల దెబ్బతిన్న కల్వర్టును పునర్నిర్మించేందుకు రూ.16 లక్షల వ్యయంతో చేపడుతున్న ఆర్. సి. సి. కల్వర్టు నిర్మాణ పనులను గుడివాడ పురపాలక సంఘం మున్సిపల్ కమీషనర్ ఎస్. మనోహర్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కల్వర్టు నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన కమీషనర్, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా పనులు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. కల్వర్టు పునర్నిర్మాణం పూర్తయిన అనంతరం ఈ మార్గంలో రాకపోకలు మరింత సురక్షితంగా, సౌకర్యవంతంగా ఉంటాయని కమీషనర్ తెలిపారు. ఈ పరిశీలనలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శివాజీ, అసిస్టెంట్ ఇంజనీర్ రాజేష్, అసిస్టెంట్ ఇంజనీర్ శివాజీ మరియు సంబంధిత కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, గృహ వసతి కల్పించాలి :- ఎమ్మెల్యే గళ్ళా మాధవి



అమరావతి, ఆగస్టు 20 నేటి శుభోదయ : రాష్ట్రంలోని అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు లేదా గృహ వసతి కల్పించాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో జీరో అవర్‌లో జర్నలిస్టుల సమస్యలను ఆమె సభ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజా స్వామ్యానికి నాలుగో స్థంభంగా జర్నలిస్టులు పనిచేస్తున్నారని, ప్రజా సమస్యలు, సామాజిక అంశాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని గళ్ళా మాధవి అన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా జర్నలిస్టుల్లో ఎక్కువ మంది పరిమిత వేతనాలతో పనిచేస్తున్నారని, సొంత ఇల్లు నిర్మించుకోవడం వారికి పెద్ద సమస్యగా మారిందని చెప్పారు. జర్నలిస్టులకు నిర్దిష్టమైన పని వేళలు లేకపోవడం, వృత్తిపరమైన ఒత్తిళ్లు కూడా వారి కుటుంబ జీవితంపై ప్రభావం చూపుతున్నాయని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వం అందించే ఆరోగ్య కార్డులు, గృహ వసతి వంటి సదుపాయాలు జర్నలిస్టులకు, వారి కుటుంబాలకు సామాజిక భద్రత కల్పిస్తాయని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ వంటి ప్రాంతాల్లో జర్నలిస్టుల కోసం కాలనీలు ఏర్పాటు చేసిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తుచేశారు. అదే విధంగా విభజిత ఆంధ్రప్రదేశ్‌లోనూ జర్నలిస్టులకు గృహ వసతి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, గృహ వసతి కల్పించాలనే ఉద్దేశంతో గతంలో జి.ఓ. నంబర్ 67, 107లను ప్రభుత్వం జారీ చేసిందని గళ్ళా మాధవి తెలిపారు. ఆ ఉత్తర్వులను అమలు చేస్తూ రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు లేదా గృహ వసతి కల్పించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును అసెంబ్లీ వేదికగా కోరారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రత్యేక దృష్టి సారించి, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు పారదర్శకంగా గృహ వసతి కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# గుడివాడ పట్టణంలో ఘనంగా ప్రపంచ దోమల దినోత్సవ అవగాహన కార్యక్రమాలు

**-బేతవోలు, బాపూజీ నగర్ పీహెచ్‌సీలలో ర్యాలీ, ప్రతిజ్ఞ చేసిన మెడికల్ టీమ్**

**-ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే పాటించాలి - దోమల నివారణతో మలేరియా, డెంగ్యూకు చెక్: వైద్యులు**





గుడివాడ, ఆగష్టు 20 నేటి శుభోదయ : ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా గుడివాడ పట్టణంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు బేతవోలు, బాపూజీ నగర్‌లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా అవగాహన సమావేశం, ప్రతిజ్ఞ, ర్యాలీ నిర్వహించి ప్రజలకు దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ డేవిడ్ ట్విన్సన్, డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ 1897 ఆగస్టు 20న శాస్త్రవేత్త సర్ రోనాల్డ్ రాస్ దోమ శరీరంలో మలేరియా పరాన్నజీవిని గుర్తించినట్లు తెలిపారు. దోమ కాటు ద్వారా మలేరియా వ్యాప్తి చెందుతుందని ప్రపంచానికి తెలియజేసిన ఈ రోజును ప్రతి ఏటా ప్రపంచ దోమల దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రతి శుక్రవారం 'ఫ్రైడే డ్రై డే' కార్యక్రమాన్ని నిర్వహించాలని వైద్యాధికారులు సూచించారు. పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, ఆరోగ్య సిబ్బంది ప్రజలకు నిరంతరం అవగాహన కల్పించాలని తెలిపారు. దోమల నియంత్రణ ద్వారా మలేరియా, డెంగ్యూ వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుడివాడ సబ్‌యూనిట్ ఆఫీసర్ కే.పీ.రావు, హెల్త్ అసిస్టెంట్ అశోక్, సీవోలు రామారావు, దుర్గ, పట్టణ హెల్త్ సెక్రటరీలు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువగా తీసుకెళ్లాలి

**సమాచార శాఖ ఆర్ జె డి ఎం వి ఎస్ ప్రసాద్**





అనంతపురం బ్యూరో ఆగస్టు 20 నేటి శుభోదయ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలను విస్తృతంగా ప్రచారం కల్పించి వాటిని ప్రజలకు వచ్చేరోగా తీసుకెళ్లాలని సమాచార పౌర సంబంధాల శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఎం వి ఎస్ ప్రసాద్ సూచించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఆయన గురువారం సాయంత్రం స్థానిక రైతు బజార్ వద్ద ఉన్న జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ప్రధాన కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డిఐపిఆర్ఓ బాల కొండయ్య తో కలిసి సమీక్షసమావేశంనిర్వహించి పలు అంశాలపై సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ యంత్రాంగంలో సమాచార శాఖ ఎంతో కీలకందని ప్రతి ఉద్యోగి బాధ్యత యుతంగా అప్పగించిన పనులను సమర్ధవంతంగా పూర్తి చేసి శాఖకు మంచి పేరు తెచ్చే విధంగా విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డి ఐ పి ఆర్ ఓ బాలకొండయ్య, డి పి ఆర్ ఓ ప్రభాకర్, పి ఆర్ ఓ సూర్యనారాయణ రెడ్డి, ఏపీఆర్ఓ ఫక్రుద్దీన్, సీనియర్ అసిస్టెంట్ ప్రభావతి, జూనియర్ అసిస్టెంట్ చాంద్ బాషా, టైపిస్టులు సుహాసిని దామోదర్ రెడ్డి , టెక్నీషియన్ కమల్ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీఓ సౌభాగ్యవతిపై క్రమశిక్షణ చర్యలు

పులిచెర్ల, ఆగష్టు 20,(నేటి శుభోదయ) :చిత్తూరు జిల్లా పులిచెర్ల మండల వి.బి.జి. రాంజీ ఉపాధి హామీ పథకం ఏపీఓ సౌభాగ్యవతిని క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఒప్పంద ఉద్యోగం నుంచి తాత్కాలికంగా తొలగించారు. ఈ మేరకు జిల్లా డ్వామా పీడీ రవికుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.





## దళితుల అభివృద్ధి విద్య ఉద్యోగాలతోనే సాధ్యం: ఎంఆర్పిఎస్ నాయకులు

యాడికి ఆగస్టు 20 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక: పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు, అనంతపురం జిల్లా ఇంచార్జ్ చిన్న సుబ్బారావు మాదిగ, కో ఇంచార్జ్ కోళ్ల కళ్యాణ్ మాదిగ సూచనల ప్రకారం యాడికి మండలం నిట్టూరు గ్రామంలో ఎంఆర్పిఎస్ నూతన గ్రామ కమిటీల ఎన్నికల కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమానికి యాడికి మండల ఇంచార్జ్ ఎంపీ పుల్లయ్య మాదిగ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మందకృష్ణ మాదిగ సుదీర్ఘంగా 32 సంవత్సరాల పాటు సాగించిన పోరాటం ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ సాధించడం సాధ్యమైందని తెలిపారు. ఈ వర్గీకరణ ఫలాలు ప్రతి ఒక్కరికీ అందాలంటే పిల్లలకు ఉన్నత చదువులు చెప్పించాలని, వారు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేలా ప్రోత్సహించాలని కోరారు. పోరాట ఫలాలను అందుకోవడానికి మరియు మాదిగ సమాజ అభివృద్ధికి మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యాడికి మండల నూతన గ్రామ కమిటీల ఇంచార్జ్ ఎంపీ పుల్లయ్య మాదిగతో పాటు ఎంఆర్పిఎస్ మండల అధ్యక్షుడు పాతకుట్ల బాలు మాదిగ, మండల అధికార ప్రతినిధి చిటికల చిరంజీవి మాదిగ, సీనియర్ నాయకులు రామాంజనేయులు మాదిగ, శివన్న మాదిగ, కిషోర్ మాదిగ, మహేష్ మాదిగ, శివ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## "పలువురు వైసిపి కార్యకర్తలను పరామర్శించిన వడ్డి"



తాడేపల్లిగూడెం రూరల్ ఆగస్టు 20 (నేటి– శుభోదయ) తాడేపల్లిగూడెం రూరల్ మండలం పలు గ్రామాలలో పలువురు వైసిపి కార్యకర్తలను గురువారం తాడేపల్లిగూడెం వైసీపీ ఇంచార్జ్ వడ్డీ రఘురామ నాయుడు పరామర్శించారు. ముందుగా నవాబ్ పాలెం గ్రామానికి చెందిన బండి మురళీకృష్ణ తల్లి ఇటీవల అకాల మరణం చెందారు. అది తెలుసుకొని వారి కుటుంబాన్ని పరామర్శించి చిత్రపటం పూలమాలవేసి నివాళులర్పించారు. అదే గ్రామానికి చెందిన బండి సర్వేశ్వరరావు కుమారుడు సాయి రంగ అనారోగ్యంగా ఉన్నారని తెలుసుకొని వారి కుటుంబానికి వెళ్లి పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన వేమగిరి రాజు యాక్సిడెంట్ జరిగి ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకొని ఆయన కుటుంబానికి వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం బంగారు గూడెం గ్రామానికి చెందిన కాసగాని దుర్గారావు తల్లి గంగారత్నం ఇటీవల ఆకాల మరణం చెందారు. ఈ విషయం తెలుసుకొని ఆ కుటుంబానికి వెళ్లి పరామర్శించి చిత్రపటాను పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే గ్రామానికి చెందిన ముప్పిడి మురళి రెడ్డి తండ్రి వెంకటరామిరెడ్డి కి అనారోగ్యంగా ఉన్నారని తెలుసుకొని ఆ కుటుంబానికి వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం వీరంపాలెం గ్రామానికి చెందిన అన్నెం శ్రీరాములు ఇటీవల అకాల మరణం చెందారు. ఈ విషయం తెలుసుకొని ఆ కుటుంబానికి వెళ్లి పరామర్శించి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ కార్యకర్తలకు ఏ ఆపద వచ్చిన ముందు ఉంటానని అది తన బాధ్యతని వైసీపీ కార్యకర్తలకు అండగా ఉండి వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవడం నా బాధ్యతని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు రూరల్ మండల అధ్యక్షులు చిట్టూరి బాపన్న, రెడ్డి రమేష్ రెడ్డి, మద్దూరి మెహర్ ప్రసాద్, ద్వారంపూడి వేణుగోపాల్ రెడ్డి, నల్లిమిల్లి విజయ నందరెడ్డి, అఖిల్, పాలకోడేటి సురేష్ మరియు ఆయా గ్రామాల వైసిపి కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ జన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి ని కలిసిన ఎస్సీ సెల్ నాయకులు..!



కోరుకొండ, ఆగస్టు 20 (నేటి శుభోదయ): రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం నూతన కార్యవర్గం బుధవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ జన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను మర్యాద పూర్వకంగా కలిశారు. మండల వైఎస్ఆర్సిపి ఎస్సి విభాగం నూతన అధ్యక్షుడు కస్నేం శ్రీనివాస్ రాజాకు పుష్ప గుచ్చం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ కు శాలువా కప్పి సత్కరించారు. రాజానగరం నియోజకవర్గం ఎస్సీసెల్ అధ్యక్షుడు గొంతు లక్ష్మణరావు, ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శులు పైడిమళ్ల కిషోర్, గొల్ల అంబేద్కర్,గ్రామ కమిటీ అధ్యక్షులు కందికట్ల యేసు, ఝండవల్లి పెద్దిరాజు,బి.వెంకన్న బాబు,చిన్న రాజారత్నం, లతో పాటు పలువురు నాయకులు, కార్యవర్గ సభ్యులుపాల్గొన్నారు.

## ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ పరీక్షల నిర్వహణ..

### -పరీక్షల కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలి-డిఆర్ఓ ఏ.మలోల



అనంతపురం బ్యూరో ఆగస్టు 20 (నేటి శుభోదయ న్యూస్) : ఈనెల 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఏపీ పవర్ యుటిలిటీస్ ఆఫ్ ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ పరీక్షలను నిర్వహించడం జరుగుతుందని, పరీక్షల కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని డిఆర్ఓ ఏ.మలోల ఆదేశించారు. గురువారం అనంతపురం కలెక్టరేట్లోని డిఆర్ఓ చాంబర్ లో ఆంధ్రప్రదేశ్ పవర్ యుటిలిటీస్ ఆఫ్ ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించే అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ (ఏఈఈ) పరీక్షలపై సంబంధిత అధికారులతో డిఆర్ఓ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ జిల్లాలో 06 కేంద్రాలలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ (ఏఈఈ) పరీక్షలను ఈనెల 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. 1.బుక్కరాయసముద్రం మండలం రోటరీపురం గ్రామం వద్దనున్న శ్రీనివాస రామానుజన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎ=౫), 2.అనంతపురం రూరల్ మండలం ఇటుకలపల్లి గ్రామం వద్దనున్న అనంతలక్ష్మి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్, 3.తాడిపత్రి మండలంలోని కదవ రోడ్ లో ఉన్న తాడిపత్రి ఇంజనీరింగ్ కాలేజ్, 4.అనంతపురం అర్బన్ లోని రుద్రంపేట వద్దనున్న పీవీకేకే ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, 5.తాడిపత్రి మండలంలోని సర్ సి.వి.రామన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్, 6.రాప్తాడు మండలం ఎల్.ఆర్.జి స్కూల్ వద్దనున్న నేషనల్ కౌన్సిల్ ఫర్ ద చర్చ్ సోషల్ యాక్షన్ ఇండియా కేంద్రాలలో పరీక్షలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 09 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మధ్యాహ్నం 02:30 గంటల నుంచి సాయంత్రం 05:30 గంటల వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్షలను సజావుగా, ప్రశాంతంగా నిర్వహించడానికి శాంతిభద్రతలు, వైద్య సహాయం, రవాణా, విద్యుత్ సరఫరా, పర్యవేక్షణ సమగ్ర సమన్వయం కోసం తగిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వెలుపల ట్రాఫిక్ నియమాలను పాటించాలని, అన్ని కేంద్రాలలో శాంతిభద్రతలను కాపాడటం, జనసమూహాలను నియంత్రించడం, అభ్యర్థుల క్రమబద్ధమైన ప్రవేశాన్ని కల్పించడం చేయాలని, అన్నిచోట్ల సెక్షన్ 144ను అమలు చేయాలని, అన్ని పరీక్షా కేంద్రాలలో నిరంతరాయ విద్యుత్ సరఫరాను చేయాలని, పరీక్షా కేంద్రాలు ఉన్న దగ్గర ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేయాలని, అన్ని పరీక్షా కేంద్రాలలో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రీతి బాయ్‌కు న్యాయం చేయాలి: వైఎస్సార్సీపీ గిరిజన విభాగం డిమాండ్



మాచర్ల: ఆర్ సి ఇన్చార్జ్ ఆగస్టు 20; నేటి శుభోదయ : మాచర్ల: సుగాలి ప్రీతి బాయ్ అత్యాచారం, హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని వైఎస్సార్సీపీ గిరిజన విభాగం నాయకులు డిమాండ్ చేశారు. న్యాయం కోసం కర్నూలు నుంచి విజయవాడ వరకు వీల్‌చైర్ యాత్ర చేపట్టిన ప్రీతి బాయ్ తల్లి పార్వతి బాయ్‌ను ప్రభుత్వం అడ్డుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. గురువారం పల్నాడు జిల్లా మాచర్లలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వైఎస్సార్సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేరాజోత్ హనుమంతు నాయక్, జిల్లా నాయకుడు రవి నాయక్, నియోజకవర్గ అధ్యక్షుడు రామావత్ సుబ్రమణ్యం నాయక్ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. తన కుమార్తెకు జరిగిన అన్యాయంపై న్యాయం కోసం దివ్యాంగురాలైన పార్వతి బాయ్ చేస్తున్న పోరాటం అభినందనీయమన్నారు. ప్రీతి బాయ్‌కు న్యాయం చేస్తామని గతంలో హామీలు ఇచ్చిన ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇప్పుడు ఆమె తల్లికి అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం, వీల్‌చైర్ యాత్రను అడ్డుకోవడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. నిందితులను కాపాడే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకుని, కేసును నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రీతి బాయ్ కేసులో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంతో పాటు చట్టపరంగా వర్తించే అన్ని కఠిన నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు గిరిజనులు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తారని నాయకులు హెచ్చరించారు. ఈ సమావేశంలో రామావత్ బ్రహ్మం నాయక్, మాజీ సర్పంచ్ వి. రవీందర్ నాయక్, లచ్చు నాయక్, రామావత్ బాలు నాయక్, రామావత్ మాధ్య నాయక్, కేతావత్ రవి నాయక్, జరపాల శివ తదితరులు పాల్గొన్నారు.

## "రైతులకు యూరియా పంపిణీలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి ఎమ్మెల్యే బొలిశెట్టి"



తాడేపల్లిగూడెం ఆగస్టు 20 (నేటి–శుభోదయ) ప్రస్తుతం యూరియా కోసం అవసరమైన ప్రూ భూమి యజమానికి రావడంతో కౌలు రైతులు యజమానిపై ఆధారపడాల్సి వస్తుందని తాడేపల్లిగూడెం శాసనసభ్యులు ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ ఈరోజు అసెంబ్లీలో ప్రస్తావించారు. అలాగే కొన్ని ప్రాంతాల్లో =దీఖల ద్వారా, మరికొన్ని ప్రాంతాల్లో సొసైటీల ద్వారా యూరియా పంపిణీ జరుగుతోందని ఈ భిన్న విధానాల వల్ల రైతుల్లో గందరగోళం ఏర్పడుతోందని సూచించారు. రైతులకు అంత నాలెడ్జ్ ఉండదని ఆయన తెలిపారు. అందుకే రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధమైన, పారదర్శకమైన యూరియా పంపిణీ విధానం అమలు చేయాలని అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ఆయన కోరారు. పంటల మ్యాపింగ్ ఆధారంగా యూరియా అవసరాన్ని ముందుగానే అంచనా వేసి రైతుల అవసరాలకు అనుగుణంగా తగినంత నిల్వలు సిద్ధం చేయాలని ఆయన సూచించారు.

కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూనే, కౌలు రైతుల వాస్తవ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతమైన విధానాన్ని రూపొందించాలని గౌరవ మంత్రివర్యులను కోరానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఈ విషయాన్ని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెంనాయుడు కు తెలియజేస్తున్నానని ఆయన అన్నారు.

## "వాస్తవాలు సరిగా తెలుసుకోకుండా వార్తలు రాయడం తగదు అసిస్టెంట్ కమిషనర్ భవానీ బాబు"



తాడేపల్లిగూడెం ఆగస్టు 20 (నేటి–శుభోదయ) తాడేపల్లిగూడెం పట్టణ మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ డి. భవానీ బాబు సమయపాలన పాటించకుండా విధులకు గైర్హాజరయ్యారంటూ ఒక ప్రముఖ న్యూస్ యాప్‌లో వచ్చిన వార్త కేవలం అవాస్తవమని నిరాధారమైనదని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ భవాని బాబు స్పష్టత ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోజు ఉదయం 10:15 గంటలకు ఆఫీస్ ఛాంబర్‌కు చేరుకున్న అసిస్టెంట్ కమిషనర్ భవాని బాబు అనంతరం గౌరవ ఆర్.డి.ఓ. ఆధ్వర్యంలో జరిగిన బి.ఎల్.ఓ.ల సమీక్షా సమావేశంలో పాల్గొని అధికారుల అటెండెన్స్ తనిఖీ వెళ్లారు. ఆ విధులను ముగించుకుని సరిగ్గా ఉదయం10:30 గంటలకల్లా మళ్లీ తన ఆఫీస్ ఛాంబర్‌కు చేరుకుని విధులు నిర్వహించానని కనీస సమాచారం సేకరించకుండా ఒక అధికారి అధికారిక విధుల నిమిత్తం వెళ్లారనే విషయాన్ని పూర్తిగా తెలుసుకోకుండా ఖాళీ కుర్చీని చూపిస్తూ వార్త రాయడం బాధాకరం అని ఆయన అన్నారు. ఈరకమైన అసత్య కథనాల వలన ప్రజాసేవలో ఉన్న అధికారుల మనోభావాలు దెబ్బతింటాయని ఇకనైనా వార్తలు ప్రచురించేటప్పుడు పూర్తి ఆధారాలతో నిజనిజాలు తెలుసుకొని పరిశీలించి ప్రచురించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## దోమల నివారణపై అవగాహన ర్యాలీ

ఒంటిమిట్ట, ఆగస్టు 20 : ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా ఒంటిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ భావన ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలకు దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు, వాటి నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. 1897 ఆగస్టు 20న బ్రిటిష్ వైద్యుడు సర్ రోనాల్డ్ రాస్ దోమల ద్వారా మలేరియా వ్యాప్తి చెందుతుందని గుర్తించిన సందర్భంగా ప్రతి ఏటా ఆగస్టు 20న ప్రపంచ దోమల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ భావన ప్రజలతో దోమల నివారణపై ప్రమాణం చేయించారు.

# రాజీవ్ గాంధీ 83వ జయంతి







చింతూరు, నేటి శుభోదయ : చింతూరు లో గురువారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ 83వ జయంతి ని ఘనంగా జరిపారు. చింతూరు సెంటర్లో రాజీవ్ గాంధీ గ్రామానికి మండల జనరల్ సెక్రెటరీ ఎస్.కె అహ్మదాలి ఆధ్వర్యంలో, నాయకులు కార్యకర్తలు ఆధ్వర్యంలోరాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియపరిచినారు. ఈ సందర్భంగా ఐ యన్ టీ యూ సి ప్రెసిడెంట్ ఎస్.కె అక్బర్ ఆలీ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ చేసిన పలు సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశ పెట్టారని, సాంకేతరంగంలో కూడా మన దేశం రాజీవ్ గాంధీ హయాము నుంచే అభివృద్ధి చెందటం ప్రారంభమైనది అన్నారు. రాజీవ్ గాంధీ పాలన లో దళిత గిరిజన సంక్షేమానికి పెద్ద పీట వేయడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో చింతూరు మండల కార్యకర్తలు చిడుమూరు పంచాయతీ, కొత్తపల్లి పంచాయతీ గ్రామస్తులు కార్యకర్తలు, మండల స్పెషల్ అధ్యక్షులు సోయం కన్నారావు,బొక్కిలి ప్రసాద్, బొడ్డు రవికుమార్, వినోద్ కుమార్,బొద్దెల కృష్ణ, బొద్దెల ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కనకదుర్గమ్మ వారికి 21 లక్షల విలువైన బంగారు ఆభరణం విరాళంగా అందజేత

విజయవాడ, ఆగస్టు 20 (నేటి శుభోదయ): ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానానికి విజయవాడ సీతారాంపురం ప్రాంతానికి చెందిన తవ్వా పుల్లమ్మ దేవాలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు రామబ్రహ్మం ప్రోత్సాహంతో శ్రీ కనకదుర్గమ్మవారి ఉత్సవాల నిమిత్తం141 గ్రాముల బరువు గల బంగారు రాధాకృష్ణుల హారాన్ని (రాళ్ళతో కూడిన బంగారు పూసల పేరు) సుమారు 21,00,000 (ఇరవై ఒక్క లక్షల రూపాయలు) ఉంటుందని ఆలయ అధికారులు వెల్లడించారు. ఈ విరాళాన్ని ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ట్రస్ట్ బోర్డు సభ్యులు రామబ్రహ్మం, టెంపుల్ సూపరింటెండెంట్ సత్యనారాయణ సమక్షంలో ఆలయ అధికారులకు అందజేశారు. ఈ కానుకను ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారి అలంకరణకు ఉపయోగించనున్నట్లు ఆలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. ఈ సందర్భంగా దాతకు అమ్మవారి దర్శనం చేయించారు. అనంతరం వేద పండితులు వేదాశీర్వచనం అందజేసి, అమ్మవారి చిత్రపటాన్ని, శేష వస్త్రాన్ని, లడ్డు ప్రసాదాలను అందజేశారు.



# పోలవరం నిర్వాసితుల పరిహారంలో పరిహాసం

### - అధికారుల నిర్లక్ష్యం, తక్కువగా పడిన రూ. 4,44,858/- పరిహారాన్ని తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్



చింతూరు, నేటి శుభోదయ :పోలవరం ప్రాజెక్ట్ ముంపునకు గురవుతున్న చింతూరు బి.సి. కాలనీకి చెందిన జానీ కి అనే బాధితుడి కి తీవ్ర అన్యాయం జరిగింది. మిగతా నిర్వాసితులందరికీ అవార్డు నోటీసులో ఉన్న మొత్తాన్ని రూపాయితో సహా జమ చేసిన అధికారులు, తన ఇంటికి వచ్చేసరికి అవార్డు నోటీసులో పేర్కొన్న మొత్తం కంటే రూ. 4,44,858/- తక్కువగా జమ చేశారు. దీనిపై సంబంధిత కంప్యూటర్ ఆపరేటర్ పోసి బాబు, సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ ను వివరణ అడగ్గా, పొరపాటు జరిగిందని ఒప్పుకొని సరిచేస్తామని చెప్పారు. ఆ తర్వాత ఎస్ డి సి ని కలవగా మిగిలిన మొత్తానికి బిల్లు పెడతామని చెప్పి మూడు నెలల పాటు ఆఫీసుల చుట్టూ తిప్పుకున్నారని బాధితుడు వాపోయాడు . ఆ తర్వాత 'వాల్యుయేషన్ మారింది' అంటూ మాట మార్చారన్నారు. అయితే మారిన వాల్యుయేషన్‌కు సంబంధించిన ఏ విధమైన అవార్డు నోటీసును కూడా తనకు చూపించలేకపోయారని జానీ తెలిపారు . అనంతరం ప్రాజెక్ట్ ఆఫీసర్ (పి ఓ ) గారిని కలవగా, వారి సమక్షంలోనే సదరు సిబ్బంది తమదే తప్పని ఒప్పుకొని, మిగిలిన మొత్తానికి 'డ్రాఫ్ట్ అవార్డు' సిద్ధం చేసి సంతకాలు కూడా చేశారని . అయినప్పటికీ, ఎస్ డి సి చంద్రశేఖర్ మాత్రం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ, విజయవాడ కమిషనర్ లేని అవార్డు నోటీసు ఉన్నట్లు అబద్ధాలు చెప్పి తమకు దక్కాల్సిన న్యాయాన్ని అడ్డుకున్నారని జానీ ఆరోపించారు . చివరకు ధవళేశ్వరం పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ వద్ద కూడా అధికారుల పొరపాటు వల్లే డబ్బులు తక్కువ పడ్డాయని తేలినప్పటికీ, "మేము ఏమీ చేయలేము, కోర్టుకు వెళ్ళి చూసుకోండి" అని బాధ్యతారహితంగా సమాధానం ఇస్తున్నారని . అధికారులే స్వయంగా తప్పు జరిగిందని ఒప్పుకున్నా, న్యాయం చేయకుండా నిర్వాసితులను కోర్టుల చుట్టూ తిప్పడం తీవ్రమైన అన్యాయమని పేర్కొన్నారు . సమస్యను పరిష్కరించాల్సిన అధికారులే ఈ విధంగా నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తూ తమను మానసిక వేదన కలిగిస్తున్నారని వాపోయారు . ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, అధికారుల పొరపాటు వల్ల నిలిచిపోయిన రూ. 4,44,858/- పరిహార మొత్తాన్ని తమకు వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఇంద్రకీలాద్రిపై ప్రారంభం కానున్న భవనాలు క్షేత్రస్థాయిలో పరిశీలించిన దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్



విజయవాడ, ఆగస్టు 20 (నేటి శుభోదయ): శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం లో నేడు ప్రారంభం కానున్న నూతన భవనాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ గురువారం ఉదయం పరిశీలించారు. నూతన 'లడ్డూ పోటు' (ప్రసాద తయారీ కేంద్రం), అత్యాధునిక వసతులతో కూడిన 'అన్నప్రసాద భవన' నిర్మాణ తుది పనులను పరిశీలన చేసారు. శాస్త్రోక్తంగా భవనాలు ప్రారంభం చేసేందుకు తగు ఏర్పాట్లు చేయాలని, శ్రావణ శుక్రవారం సందర్భంగా వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. ? ఈ కార్యక్రమంలో దేవస్థాన ఈవో వి.కె. శీనా నాయక్, స్థానాచార్య వి. శివ ప్రసాద్ శర్మ,ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎల్. రమతో పాటు దేవస్థాన ఇంజినీర్లు,ఇతర ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని డిమాండ్

### - జర్నలిస్టు పి. గోవిందుపై దాడికి పాల్పడిన గుడివాడ కృష్ణను అరెస్టు చేయాలి...

### - జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా....




విశాఖపట్నం జిల్లా నేటి శుభోదయ ఆగస్టు : 20 విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండల విశాలాంధ్ర రిపోర్టర్ పి. గోవిందుపై దాడికి వ్యతిరేకంగా జర్నలిస్టులు కదం తొక్కి నిరసన గళం వినిపించారు . దాడికి పాల్పడిన గుడివాడ కృష్ణను తక్షణమే అత్యాయత్నం కింద కేసు నమోదు చేసి, అరెస్టు చేయాలని జర్నలిస్టు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. విశాఖ నగరంలోని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద గురువారం ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. పి. గోవిందు పూసపాటిరేగలో భూ అక్రమాలపై వార్తలు రాయడంతో కక్ష కట్టి భూ కబ్జాలకు పాల్పడుతున్న పి. గోవిందు ఈ దురాగతానికి దిగారన్నారు. అతను ఓ రాజకీయ పార్టీలో స్థానికనేతగా ఉన్నాడని తెలుస్తుందని తక్షణమే అతన్ని ఆ పార్టీ నుండి బహిష్కరించాలని కోరారు. గోవిందపై దాడికి పాల్పడినట్టు ఫోటోలు, వీడియోలు ఉన్నప్పటికీ ఇప్పటివరకు అతన్ని అరెస్టు చేయలేదని ఆరోపించారు. జర్నలిస్టులకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు . ఇది మీడియా స్వేచ్ఛపై దాడి అని , మీడియా స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు జర్నలిస్టులపై దాడుల నివారణ కమిటీలు గత 10 ఏళ్ళుగా పెండింగ్ లో ఉన్నాయని తక్షణమే ఆ కమిటీలను రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించాలని కోరారు. నిజాలను నిర్భయంగా వెలుగులోకి తెస్తే భౌతిక దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. అధికారులు , రాజకీయ నేతలు మీడియా ప్రతినిధులపై దాడులు జరుగుతున్న పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తూ, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులపై దాడులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విశాలాంధ్ర పత్రిక విశాఖపట్నం బ్యూరో చీఫ్ పి. రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ ఆందోళనలో ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. రామచంద్ర రావు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు కె. రాము, ప్రధాన కార్యదర్శి కె .చంద్రమోహన్, కోశాధికారి కె.పరశురామ్, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. సత్యనారాయణ, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాజు, ఐడిజెఎన్ రాష్ట్ర నాయకుడు మధు, విశాలాంధ్ర విశాఖ ఎడిషన్ మేనేజర్ సనపల నరసింహాలు, విశాలాంధ్ర బుక్ హౌస్ మేనేజర్ ఇబ్రహీం , సీనియర్ జర్నలిస్టులు , గౌతమ్, కె .నరసింహం, అనీష్, బి.ఏ .నాయుడు,ఎం. శ్రీహరి, నేమాల హనీష్ కుమార్ , డి ఎర్రయ్య రెడ్డి , వి అప్పలరాజు , అబ్బాస్ , ప్రజా గాయకుడు దేవిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక క్యాంపెయిన్ డేస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

### - ఓటర్ జాబితాలో తమ వివరాలను పరిశీలించుకోవాలి: వీఎంసీ కమిషనర్, డెప్యూటీ జిల్లా ఎన్నికల అధికారి ధ్యానచంద్ర




విజయవాడ, ఆగస్టు 20 (నేటి శుభోదయ): భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 22, 23, 29, 30 తేదీల్లో అనగా శని, ఆదివారాల్లో ప్రత్యేక క్యాంపెయిన్ డేస్ నిర్వహిస్తున్నట్లు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్, డెప్యూటీ జిల్లా ఎన్నికల అధికారి ధ్యానచంద్ర తెలిపారు. ఈ ప్రత్యేక క్యాంపెయిన్ డేస్‌లో భాగంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో సంబంధిత బూత్ లెవెల్ అధికారులు (బీఎల్‌ఓలు) ముసాయిదా ఓటర్ జాబితాతో పాటు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని కమిషనర్ పేర్కొన్నారు. ప్రజలు తమ ఓటు వివరాలను ముసాయిదా ఓటర్ జాబితాలో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని ఆయన సూచించారు. ఓటర్ జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకోవాలనుకునేవారు, పేరు లేదా ఇతర వివరాల్లో మార్పులు, చేర్పులు, సవరణలు చేయించుకోవాలనుకునేవారు, అలాగే ముసాయిదా ఓటర్ జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉన్నవారు సంబంధిత పోలింగ్ కేంద్రంలో అందుబాటులో ఉన్న బీఎల్‌ఓలను సంప్రదించి తమ దరఖాస్తులను సమర్పించుకోవచ్చని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఈ ప్రత్యేక క్యాంపెయిన్ డేస్‌ను సద్వినియోగం చేసుకుని తమ ఓటు వివరాలను పరిశీలించుకోవాలని, ఓటర్ జాబితాలో ఏవైనా తప్పులు లేదా మార్పులు అవసరమైతే నిర్ణీత ప్రక్రియ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

ప్రజలకు ఓటర్ జాబితా సంబంధిత సందేహాలు, సహాయం అవసరమైన పక్షంలో ఎన్టీఆర్ జిల్లా హెల్ప్‌లైన్ నంబర్ 9154970454ను సంప్రదించాలని సూచించారు.

# దోమల నివారణకు వీఎంసీ విస్తృత చర్యలు



విజయవాడ, ఆగస్టు 20 (నేటి శుభోదయ): ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా వంటి వ్యాధుల నివారణకు నగరవాసులు అప్రమత్తంగా ఉండాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర ఆదేశాల మేరకు వీఎంసీ ముఖ్య వైద్య ఆరోగ్య అధికారి డా. గోపాల్ నాయక్ ఆధ్వర్యంలో బయాలజిస్ట్ సూర్య నాయక్ దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ ఇన్చార్జ్ డాక్టర్ గోపాల నాయక్ మాట్లాడుతూ, నగరంలో దోమల నివారణతో పాటు దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నియంత్రణకు ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో విస్తృత చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. యాంటీ -లార్వా ఆపరేషన్లు: మురుగు కాలువలు, నిల్వ నీటి ప్రదేశాల్లో దోమల లార్వా వృద్ధిని అరికట్టేందుకు ఎం.ఎల్. ఆయిల్, అబేట్ పిచికారీతో పాటు అవసరమైన ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా స్ప్రేయింగ్ నిర్వహిస్తున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో దోమల సాంద్రతను గుర్తించి నియంత్రించేందుకు 'స్మార్ట్ మాస్కిటో ఎలిమినేటర్', 'సెన్సార్ ట్రాపర్స్' వంటి ఆధునిక పరికరాలతో పాటు ×శీ ఆధారిత ఫాగింగ్ మిషన్లను వినియోగిస్తున్నారు. నిల్వ ఉన్న స్వచ్ఛమైన నీటిలో దోమల లార్వాలను తినే గంబూషియా చేపలను విడుదల చేసి దోమల వృద్ధిని సహజ పద్ధతిలో నియంత్రిస్తున్నారు. నగరంలోని అన్ని వార్డుల్లో అవసరమైన ప్రాంతాల్లో క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహిస్తూ, ప్రతి శుక్రవారం 'డ్రై డే'గా పాటించేలా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. బయాలజిస్ట్ సూర్య కుమార్ గారు మాట్లాడుతూ ఇళ్ల పరిసరాల్లో పాత టైర్లు, కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ కప్పులు, పూల కుండీలు తదితర వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు అవసరమైన సందర్భాల్లో దోమతెరలను వినియోగించాలని తెలిపారు. దోమల రహిత విజయవాడ నిర్మాణంలో ప్రతి నగరవాసి భాగస్వామి కావాలని కోరారు. ప్రజలు తమ ఇళ్లలోనూ, పరిసరాల్లోనూ నీరు నిల్వ ఉండకుండా చూసుకుంటే దోమల వృద్ధిని గణనీయంగా అరికట్టవచ్చని అధికారులు తెలిపారు. వీఎంసీ చేపడుతున్న దోమల నివారణ చర్యలకు ప్రజలు సహకరించి, ఆరోగ్యకరమైన విజయవాడ నిర్మాణానికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (ఐవీడిఎూ) డా.ఙా. శ్రవణ్ బాబు , జిల్లా మలేరియా అధికారి (ఐమీ) ఐ. రాజు నాయక్, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ముఖ్య వైద్య ఆరోగ్య అధికారి (జవీనూ) డా. గోపాల్ నాయక్, బయాలజిస్ట్ సూర్య కుమార్, మలేరియా సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీఓగా చిన్న రెడ్డమ్మకు బాధ్యతలు

పులిచెర్ల, ఆగష్టు 20,(నేటి శుభోదయ) :వి.బి.జి. రాంజీ ఉపాధి హామీ పథకం ఏపీఓ సౌభాగ్యవతిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ఒప్పంద ఉద్యోగం నుంచి ఆమెను తాత్కాలికంగా తొలగిస్తూ జిల్లా డ్వామా పీడీ రవికుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. సౌభాగ్యవతి స్థానంలో పలమనేరు క్లస్టర్ ఎంటీసీగా పనిచేస్తున్న చిన్న రెడ్డమ్మను పులిచెర్ల ఏపీఓగా నియమించారు.




# జగ్గయ్యపేట రైల్వే స్టేషన్ను అన్ని విధాల అభివృద్ధి నూతన రైల్వే లైన్, కొత్త రైల్వే సేవలు పై గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సౌత్ సెంట్రల్ రైల్వే



విజయవాడ, ఆగస్టు 20 (నేటి శుభోదయ): సికింద్రాబాద్ వేదికగా 18 మంది పార్లమెంట్ సభ్యులతో సౌత్ సెంట్రల్ రైల్వే వారు నిర్వహించిన సమావేశంలో విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగ్గయ్యపేట రైల్వే స్టేషన్ అభివృద్ధి నూతన రైల్వే లైన్ కొత్త రైల్ సేవలు రైల్వే స్టేషన్ మౌలిక సదుపాయాలు ప్రయాణికుల సౌకర్యాలు వంటి అంశాలపై ఎంపీ చిన్ని సమావేశంలో చర్చించారు ఈ సమావేశంలో ఎంపీ చిన్ని తో పాటు జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్( తాతయ్య) పాల్గొన్నారు.. ఈ సందర్భంగా ఎంపీ చిన్ని మాట్లాడుతూ జగ్గయ్యపేట రైల్వే స్టేషన్, రైల్వే లైన్ కొత్త రైల్ సర్వీస్ వంటి మూడు ప్రధానమైన అంశాలను సౌత్ సెంట్రల్ రైల్వే ముందు ఉంచినట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా మొదటి అంశంగా కాచిగూడ జగ్గయ్యపేట కొత్త రైల్వే లైన్ పై ఎంపీ చిన్ని సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులను అడుగగా రైల్వే అధికారులు సమాధానం ఇస్తూ కాచిగూడ జగ్గయ్యపేట కొత్త రైల్వే లైన్ సుమారు 228 కిలోమీటర్ల పొడవుతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డి పి ఆర్ ) రూపకల్పన సైతం తుది దశకు చేరుకుందని అన్నారు. హైదరాబాదు నుండి ఏపీలోని పారిశ్రామిక ప్రాంతమైన జగ్గయ్యపేటకు ప్రయాణ దూరం సమయం ఈ ప్రాజెక్టు పూర్తయితే తగ్గనున్నాయి. ఈ ప్రాజెక్టు ద్వారా రవాణా వాణిజ్యం కార్గో రవాణా రంగాలు అభివృద్ధి చెందనున్నాయి, ఈ ప్రాజెక్టు పూర్తయ్యే సమయానికి పలు నూతన రైల్వేస్టేషన్లో సైతం ఏర్పాటు అయ్యే అవకాశం ఉందిఅని తెలిపారు. మరోవైపు రెండవ అంశంగా ఎంపీ చిన్ని జగ్గయ్యపేట రైల్వే స్టేషన్ లో ప్రయాణికుల సౌకర్యాలపై రైల్వే అధికారులను అడగగా రైల్వే అధికారులు సమాధానం ఇస్తూ జగ్గయ్యపేట రైల్వే స్టేషన్లో ప్రయాణికుల సౌకర్యాలు, స్టేషన్ మౌలిక సదుపాయాల సమగ్ర ఉన్నతీకరణను ప్రస్తుతం కొనసాగుతున్న మోటమర్రి– విష్ణుపురం డబ్లింగ్ పనుల పరిధిలోకి చేర్చడం జరిగిందని కోరిన సౌకర్యాలైన అప్రోచ్ రోడ్ బుకింగ్ కౌంటర్ సౌకర్యాల మెరుగుదల, ఇతర కనీస అవసరమైన సౌకర్యాల కల్పన పనులను డబ్లింగ్ పనులతో పాటే క్రమ పద్ధతిలో అమలు చేసి పూర్తి చేయడం జరుగుతుందని తెలియజేశారు మూడో ప్రధానమైన అంశంగా మోటమర్రి–జగ్గయ్యపేట–విష్ణుపురం రైల్వే లైన్ లో తగిన పాసింజర్ రైలు సర్వీసులను ప్రవేశపెట్టాలని ఎంపీ చిన్ని రైల్వే అధికారులను అభ్యర్థించగా రైల్వే అధికారులు మాట్లాడుతూ మోటమర్రి–జగ్గయ్యపేట–విష్ణుపురం రైల్వే లైన్ ప్రస్తుతం కేవలం సరుకు రవాణాకు మాత్రమే అనువుగా ఉందని ప్రయాణికుల రైళ్ళను నడపాలంటే సామర్థ్య భద్రత మెరుగుదల పనులతో మౌలిక సదుపాయాలను ఉన్నతీకరించాల్సి ఉందని అన్నారు. మంజూరైన డబ్లింగ్ పనులతో పాటు ఈ ప్రక్రియను కూడా జరుగుతుందని తెలియజేశారు ఈ మూడు ప్రధానమైన అంశాలను సౌత్ సెంట్రల్ రైల్వే అధికారుల ముందు ఎంపీ చిన్ని ఉంచారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ చిన్ని, కర్నూలు ఎంపీ నాగరాజు, సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవత్సవ, తెలంగాణ ఎంపీలు, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

# "ఇంటింటికీ తెలుగుదేశం"లో ఎమ్మెల్యే బొండా ఉమా



విజయవాడ, ఆగస్టు 20 (నేటి శుభోదయ): 63వ డివిజన్ సుందరయ్య నగర్‌లో గురువారం సాయంత్రం "రెండేళ్ల నమ్మకం -- సంక్షేమం, అభివృద్ధి" కార్యక్రమంలో భాగంగా "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమం లో ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పాల్గొని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను పలకరిస్తూ వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగాహొహొబొండా ఉమా మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు రాష్ట్రవ్యాప్తంగా "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. విజయవాడ సెంట్రల్ లోని 21 డివిజన్లలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజల గడపకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటోందన్నారు. పెన్షన్లను పెంచి వృద్ధులు, వితంతువులు తదితరులకు రూ.4,000, దివ్యాంగులకు రూ.6,000, మంచానికే పరిమితమైన వారికి రూ.10,000, తలసేమియా బాధితులకు రూ.15,000 చొప్పున అందిస్తున్నామని ఉమా తెలిపారు. అలాగే మహిళలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, అర్హత ఉన్న ప్రతి బిడ్డకు "తల్లికి వందనం", పేదలకు అందుబాటులో ఉండే విధంగా అన్న క్యాంటీన్ల ద్వారా భోజనం వంటి పలు సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తోందన్నారు. "ప్రజల మధ్య ఉండటం ప్రజల సమస్యలను తెలుసుకోవడం వాటి పరిష్కారానికి కృషి చేయడం మా బాధ్యత" అని ఉమా స్పష్టం చేశారు. కులం, మతం, పార్టీ అనే భేదాలు లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సహాయం అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. సెంట్రల్ నియోజకవర్గంలో "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని, ప్రజలతో నేరుగా మమేకమై వారి అభిప్రాయాలు, సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నామని చెప్పారు. రాబోయే విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజల ఆశీర్వాదంతో టీడీపీ విజయాన్ని సాధించడం ఖాయమని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 63వ డివిజన్లో డోర్ టు డోర్ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు లబ్బవైకుంఠం, ఇన్చార్జి మోతూర్కర్ కాసిం, సెక్రటరీ కోలా శ్రీనివాసరావు, సెంట్రల్ నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షులు దుర్గా శ్రీరాము, మహిళా నాయకురాలు లబ్బ దుర్గ వెల్దాం పెద్ది శ్రీను కిషోర్ రాము మోదుగలు గణేష్ మెహర్, పైడి శీను, ప్రసాద్ శివ కృష్ణ డివిజన్ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జిలు, మహిళా నాయకులు, పాల్గొన్నారు.

# "యునైటెడ్ పాస్టర్ అసోసియేషన్ నెలవారి సర్వసభ్య సమావేశం"




పెంటపాడు ఆగస్టు 20 (నేటి–శుభోదయ) ప్రతి ఒక్కరూ ఏసుక్రీస్తు బాటలో నడవాలని ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ నియోజకవర్గ అధ్యక్షులు, రాష్ట్ర నాయకులు బిషప్ రెవరెండ్ జ్యోతి ఆనంద్ అన్నారు. గురువారం పెంటపాడు కూనాగరపేట పాస్టర్ పేతురు గృహము నందు నెలవారి సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పెంటపాడు యూపీఏ మండల ప్రెసిడెంట్ బి.ఆర్.కె మోజెస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన రెవరెండ్ బిషప్ జ్యోతి ఆనంద్ మాట్లాడుతూ ఆయన యేసు క్రీస్తు ఆశయాలను ప్రతి ఒక్కరు అనుసరించి ముందుకు నడవాలని ఆ దేవుని యొక్క దీవెనలు మీ అందరికీ కలిగి సుఖ సంతోషాలతో మీ కుటుంబాలు చల్లగా వర్ధిల్లాలని బైబిల్ అనుసారముగా నడుచుకోవాలని పాస్టర్లకు బోధించారు. పాస్టర్లు అందరూ ఐక్యమైక్యంగా వెళ్లాలని ఒకరికి ఒకరు సహాయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని ఆయన బోధించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సెక్రటరీ పాస్టర్ సామ్యూల్ పాల్, మండల సెక్రెటరీ కే. కృపావరం, ట్రెజరర్ ఐజక్ పాల్, గూడెం మండల కోశాధికారి బన్నీ పాల్, పాస్టర్ రాజ్ పాల్ మరియు నియోజకవర్గ తాడేపల్లిగూడెం రూరల్ పెంటపాడు మండలం వివిధ గ్రామాల నుండి పాస్టర్లు విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# భవ్య' పథకం కింద విశాఖపట్నం -- చెన్నై కారిడార్‌లో కెమికల్, పెట్రోకెమికల్ పార్కులు ఏర్పాటు చేయాలి

**- ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు**



విశాఖపట్నం జిల్లా నేటి శుభోదయ ఆగస్టు : 20 కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'భవ్య' పథకం కింద రాష్ట్రంలో అభివృద్ధి చేయనున్న పారిశ్రామిక పార్కులలో భాగంగా, విశాఖపట్నం -- చెన్నై పి.సి.పి.ఐ.ఆర్ కారిడార్‌లో కెమికల్ మరియు పెట్రోకెమికల్ పార్కులను ప్రాధాన్యతా క్రమంలో ఏర్పాటు చేయాలని గాజువాక శాసనసభ్యులు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అసెంబ్లీ వేదికగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మన దేశం నుంచి ప్రపంచానికి పెద్దఎత్తున బల్క్ డ్రగ్స్, ఔషధాలు సరఫరా చేస్తున్నప్పటికీ, ముడిసరుకు లభ్యత లేక అనేక ఫార్మా పరిశ్రమలు సిక్ యూనిట్లుగా మారుతున్నాయని, అధిక ధరలతో ముడిసరుకును దిగుమతి చేసుకోవాల్సి వస్తోందని గుర్తు చేశారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వస్తుండటం, మెరుగైన పోర్టులు మరియు సీ–రూట్స్ ఉన్న విశాఖ -- చెన్నై కారిడార్‌లో కెమికల్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తే పరిశ్రమలకు ఎంతో ఊతం లభించడంతో పాటు డిమాండ్‌కు తగిన పెట్టుబడులు వస్తాయని వివరించారు. అలాగే ప్రతి పరిశ్రమ విడివిడిగా కాలుష్య శుద్ధి ప్లాంట్లు ఏర్పాటు చేయడం భారమైనందున ప్రభుత్వమే కామన్ ఎఫ్లుయెంట్ ట్రీట్మెంట్ ప్లాంట్స్ ఏర్పాటు చేయాలని, అవి నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా పనిచేసేలా పర్యవేక్షించాలని కోరారు. వీటితో పాటు పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు అక్కడే రెసిడెన్షియల్ క్వార్టర్స్, ఉత్పత్తుల నాణ్యత పరిశీలనకు టెస్టింగ్ సెంటర్లు, స్థానిక యువతకు శిక్షణ ఇచ్చేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను నెలకొల్పాలని సూచించారు. పరిశ్రమల్లో అనుకోని అగ్నిప్రమాదాలు లేదా మరణాలు సంభవించినప్పుడు రాజకీయ ఒత్తిళ్లతో అపరిమిత పరిహారాల సమస్యలు రాకుండా, ఇరువర్గాలకు న్యాయం జరిగేలా ప్రభుత్వమే ముందస్తుగా ప్రామాణిక ప్రమాద బీమా మరియు స్పష్టమైన నష్టపరిహార విధానాన్ని అమలు చేయాలని కోరారు.

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .








# అభివృద్ధి అంటే ఉన్నవాటిని మూసేయడమా?

**- ఇది అభివృద్ధి కాదు విధ్వంసం" - గాంధీజీ ఆశించిన స్వాతంత్ర్యం ఇదేనా? - విశాఖ ఎయిర్‌పోర్టు కార్మికులకు తెలుగు శక్తి అండ**
**- వైసీపీ నడిపిస్తుందని ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసం? - తెలుగు శక్తి అధినేత బి.వి.రామ్**

విశాఖపట్నం జిల్లా నేటి శుభోదయ ఆగస్టు : 20 గాంధీజీ నిజమైన స్వాతంత్ర్యం కోసం పోరాడారు. స్వాతంత్ర్యం వచ్చిన భారతదేశంలోనే ప్రజలు స్వేచ్ఛ లేకుండా, తమ హక్కుల కోసం రోడ్ల మీదకు రావాల్సి వస్తే, ఇది దేశానికి శోచనీయమైన పరిస్థితి. గాంధీజీ చెప్పినట్టు చెడు వినకండి, చెడు చూడకండి, చెడు మాట్లాడకండి అన్నారు. కానీ గాంధీజీ సిద్ధాంతాలను ఈ కార్మికులే పాటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖపట్నం ఎయిర్‌పోర్టు కార్మికులకు మద్దతుగా తెలుగు శక్తి అధినేత బి.వి.రామ్ గురువారం ఉదయం మహాత్మా గాంధీకి పూలదండలు వేసి అనంతరం విలేకరులతో మాట్లాడారు. "మేము ఒక్కటే అడుగుతున్నాం. చంద్రబాబు నాయుడు అభివృద్ధి అంటే ఏంటి? అభివృద్ధి అంటే ఉన్నవాటిని మూసేయడమా? అభివృద్ధి పేరుతో విధ్వంసం చేస్తున్నారు. గత ఇరవై సంవత్సరాలుగా పనిచేసిన ఈ కార్మికులు రోడ్డున పడితే వీళ్లు ఎలా బతకాలి? చంద్రబాబు నాయుడు , మీరు మీ స్వార్థం కోసం చూసుకున్నారు తప్ప ప్రజల కోసం చూడటం లేదు. కార్పొరేట్ కంపెనీలకు కొమ్ముకాస్తున్నారే తప్ప సామాన్య ప్రజలను పట్టించుకోవడం లేదు" అని మండిపడ్డారు." 'సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు' అని చెప్పే మీరు ఈ రోజు ప్రజల పరిస్థితిని ఎందుకు పట్టించుకోవడం లేదు? మేము ఒక్కటే కోరుతున్నాం. చంద్రబాబు నాయుడు, ఈ పార్లమెంట్ సాక్షిగా, వీరికి న్యాయం చేయాల్సిన బాధ్యత మీపై ఉంది. ఇది చివరి అవకాశం. తక్షణమే వీరికి న్యాయం చేయాలని తెలుగు శక్తి డిమాండ్ చేస్తోందన్నారు. మహిళలను లక్షాధికారులను చేస్తానని చెప్పి, మహిళలను రోడ్డు మీదకు లాగేశారన్నారు. "నాడు ఈ దేశానికి ఒక మహిళ, ఇందిరా గాంధీ ప్రధానమంత్రి అయ్యారు. నేడు మీ ప్రభుత్వ హయాంలో మహిళల బ్రతుకులు రోడ్డు పాలయ్యాయన్నారు. కార్మికులు తమ హక్కుల కోసం మాట్లాడుతుంటే, వాళ్లను వైసీపీ నడిపిస్తుందని ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసం? ఇలా మాట్లాడడానికి తెలుగుదేశం పార్టీ నాయకులకు సిగ్గుండాలి. కార్మికులు కడుపు మండిపోయి తమ సమస్యల కోసం పోరాడుతుంటే, దానిలో కూడా రాజకీయ కోణం చూడడం సరైనది కాదు" అన్నారు. ప్రతి విషయంలోనూ రాజకీయాన్ని తీసుకురావడం సరికాదన్నారు. 34 సంవత్సరాల నాటి విషయాలను ప్రస్తావిస్తూ, ప్రజల అసలు సమస్యలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. ఇలా ప్రతి సమస్యను డైవర్ట్ చేయడం ప్రజలను మోసం చేయడమే అన్నారు.

**తెలుగు శక్తి డిమాండ్స్:**

కార్మికులకు న్యాయం జరగాలి. విశాఖపట్నం డొమెస్టిక్ ఎయిర్‌పోర్టును కొనసాగించాలి. ఇది ప్రజల ఆకాంక్ష. విశాఖ ఎంపీ, స్థానిక ఎమ్మెల్యేలు ఈ సమస్యను ఎందుకు పట్టించుకోవడం లేదు? గతంలో ఇతర సందర్భాల్లో చేసిన విధంగా వీరి సమస్యను కూడా పరిష్కరించాలి. 'అక్కడ పని పెడతాం, ఇక్కడ పని పెడతాం' అని చెప్పడం కాదు. ఇన్నాళ్లు సేవ చేసిన కార్మికుల భవిష్యత్తుకు భరోసా కల్పించి, వారి సేవకు తగిన గ్రాట్యుటీ, పరిహారం అందించాలి. ఇంత జరుగుతున్నా పవన్ కళ్యాణ్ ఎక్కడ దాక్కున్నారో తెలియడం లేదు."పవన్ కళ్యాణ్ సభల్లో మాట్లాడేటప్పుడు మహిళలకు ఎక్కడ అన్యాయం జరగకుండా నేను అండగా ఉంటానని చెప్పిన పెద్ద మనిషి, ఇప్పుడు ఇక్కడ అన్యాయం జరుగుతుంటే ఎక్కడ దాక్కున్నారో తెలియడం లేదు. ఇప్పటికైనా కళ్లు తెరవాలని కోరుతున్నామన్నారు. "తెలుగు శక్తి తరఫున ఒక అన్నగా, తమ్ముడిగా, కొడుకుగా, మనవడిగా, వారి మనిషిగా మేము ఈ కార్మికుల పక్షాన నిలబడతాం. చంద్రబాబు నాయుడు ప్రజల కుటుంబానికి పెద్ద కొడుకుగా ఉంటామని ప్రమాణం చేసిన మీరు ప్రజలను మోసం చేయడం సరికాదు. తెలుగు శక్తి కార్మికులకు అండగా నిలబడటం తప్ప ఎవరికీ భయపడమని తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ స్పష్టం చేశారు. ఎయిర్పోర్ట్ కార్మికులతో బివి రామ్ పాదయాత్ర చేసుకుంటూ విశాఖ తొలి మేయర్ ఎన్.ఎస్.ఎన్. రెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్ ను కార్మికులతో కలిసి ఆయన కార్యాలయంలో కలిసి కార్మికుల సమస్య వివరించడం జరిగిందని తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ తెలియజేశారు.

# కుడుములూరులో సబ్ కలెక్టర్‌తో కలిసి జగన్మోహన్ రాజు పర్యటన

**- 126 మంది మత్స్యకారులకు ఇళ్ల పట్టాలపై దృష్టి -- ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభం -- రహదారి, భూ సమస్యలపై అధికారులతో సమీక్ష**



ఒంటిమిట్ట, ఆగస్టు 20 : రాజంపేట నియోజకవర్గంలో ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించేందుకు టీడీపీ రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు గురువారం ఒంటిమిట్ట మండలం కుడుములూరు గ్రామంలో పర్యటించారు. రాజంపేట సబ్ కలెక్టర్ భావన, కడప ఆర్డీవో మురళి, తహసీల్దార్ దామోదర్‌రెడ్డిలతో కలిసి గ్రామంలో పలు ప్రాంతాలను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు ఏర్పాటు చేసిన నూతన ఆర్‌ఓ ప్లాంట్‌ను జగన్మోహన్ రాజు అధికారులతో కలిసి ప్రారంభించారు. ప్లాంట్ నిర్వహణ, నీటి సరఫరా విధానాన్ని పరిశీలించి ప్రజలకు నిరంతరం స్వచ్ఛమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కుడుములూరులో అర్హులైన 126 మంది మత్స్యకారులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసే అంశంపై ఆయన అధికారులతో చర్చించారు. రెవెన్యూ రికార్డులను పరిశీలించి అర్హులైన వారికి త్వరితగతిన పట్టాలు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. గ్రామంలో రాకపోకలకు పరిశీలించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పనులను త్వరితగతిన చేపట్టేలా అధికారులతో చర్చించారు. గ్రామస్తులు తెలిపిన భూ సమస్యలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, హద్దుల వివాదాలపై జగన్మోహన్ రాజు ఆరా తీశారు. రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గజ్జల నరసింహారెడ్డి, ముద్దు కృష్ణారెడ్డి, బొబ్బిలి ఈశ్వరయ్య, సాలాబాదు బుజ్జి, రమణ, చెన్నయ్య, పెద్ద రమణ, నల్లగొండ వెంకటసుబ్బారెడ్డి, పత్తి సుబ్బరాయుడు, ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు నియోజకవర్గ ఇన్‌చార్జ్ స్వయంగా ఉన్నతాధికారులను గ్రామానికి తీసుకువచ్చి క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహించడంపై కుడుములూరు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు

# అన్న క్యాంటీన్లలో ఆహార నాణ్యత, సేవలపై ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలు తెలుసుకున్న వియంసి కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ, ఆగస్టు 20 (నేటి శుభోదయ): విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర గురువారం గులాబీతోటలోని అన్న క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్యాంటీన్‌లో అందిస్తున్న అల్పాహారం, భోజనం నాణ్యత, పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణ, ప్రజలకు అందుతున్న సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. క్యాంటీన్‌కు భోజనం చేసేందుకు వచ్చిన ప్రజలతో కమిషనర్ మాట్లాడి, అన్న క్యాంటీన్‌లో అందిస్తున్న ఆహారం రుచి, నాణ్యత, పరిమాణం, ధరలు, సమయపాలన, సౌకర్యాలు తదితర అంశాలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు అందిస్తున్న ఫీడ్‌బ్యాక్‌ను స్వీకరించి, వారి సూచనలు మరియు సమస్యలను నమోదు చేసుకుని, అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్న క్యాంటీన్లు పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన ఆహారం అందించే ముఖ్యమైన సేవా కేంద్రాలని కమిషనర్ పేర్కొన్నారు. క్యాంటీన్లలో ఆహార నాణ్యత విషయంలో ఎటువంటి రాజీ ఉండకూడదని, పరిశుభ్రత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు. క్యాంటీన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, వంటశాల, భోజన ప్రదేశం, తాగునీటి సదుపాయాలు తదితర ప్రాంతాలను పరిశుభ్రంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు సౌకర్యవంతమైన, నాణ్యమైన సేవలు అందేలా నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.ప్రజల నుంచి నేరుగా అందే అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అన్న క్యాంటీన్ల సేవలను మరింత మెరుగుపరచేందుకు చర్యలు చేపడతామని కమిషనర్ తెలిపారు.

# వేముల లో ఘనంగా ప్రపంచ దోమల దినోత్సవం

వేముల ఆగష్టు 20 : ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా ఈ రోజు వేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు డాక్టర్ సుభాషిణి ఆధ్వర్యంలో "సర్ రోనాల్డ్ రాస్ " కు ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భముగా వైద్యధికారి మాట్లాడుతూ డాక్టర్ .రోనాల్డ్ రాస్ 1897 లో అడ అనఫిలీస్ దోమలద్వారా మలేరియా వ్యాధి వ్యాప్తి చెందుతుంది అని కనుక్కన్న రోజు. ఈ చరిత్రత్మక రోజు ను పురస్కరించుకొని రోనాల్డ్ రాస్ గారికి ప్రతి ఏటా ఈరోజు నివాళులు అర్పించడం జరుగుతుంది అని అన్నారు ఈ సందర్భంగా కొత్తపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ నందు డిప్యూటీ హెల్త్ ఆఫీసర్ ఉషారాణి, మాట్లాడుతూ దోమలు ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులు అయిన మలేరియా,డెంగ్యూ, చికెన్ గునియా, మెదడు వాపు జ్వరం, బోధకాలు గురించి, దోమలు పుట్టకుండా, దోమలు కుట్టకుండ తీసుకోవాల్సిన సదస్సు ను నిర్వహించడంజరిగింది. ప్రతి శుక్రవారము ఫ్రైడే డ్రైడే పాటించాలని, పరిసరాలు పరిశుభ్రముగా ఉండాలని దోమతేరలు వాడాలని చెప్పడము జరిగినది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు భవాని, ఇతర ఉపాధ్యాయబృందం,సూపర్వైజర్‌విజయలక్ష్మి, ఆరోగ్య కార్యకర్తలు శ్రీనివాస్ రావు, లక్ష్మి దేవి,రాజేశ్వరి, సిహెచ్ఓ గౌతమీ, ఎంఎల్ హెచ్పిఎస్, పిహెచ్సి సిబ్బంది విష్ణు వర్ధన్, జబ్బీల్లా ఆశకార్యకర్తలు నాగలక్ష్మి, దేవి పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ దోమల దినోత్సవం





మదనపల్లె ఆగస్టు 20, : అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లెలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం లో ఘనంగా ప్రపంచ దోమల దినోత్సవం జోనల్ మలేరియా అధికారి డాక్టర్ నిర్మల్ అలెగ్జాండర్, జిల్లా మలేరియా అధికారి రామచంద్ర రెడ్డిల అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. గురువారం ప్రపంచ దోమల దినోత్సవం ప్రాముఖ్యత పై డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ అవగాహన కల్పించారు. ముందుగా సర్ రోనాల్డ్ రాస్ కు జెడ్ ఎమ్ ఓ. డాక్టర్ నిర్మల్ అలెగ్జాండర్, పరిపాలన అధికారి డాక్టర్ మధుసూదన్ రెడ్డి, ఆర్బిఎస్ కే. జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, డిఎమ్ఓ రామచంద్ర రెడ్డి, ఎస్ఓ ఓబుల్ రెడ్డి, డిప్యూటీ. హెచ్ఈఓ. మహమ్మద్ రఫీ, సబ్ యూనిట్ అధికారి ఖలీలుల్ల ఖాన్ లు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుచు సర్ రోనాల్డ్ రాస్ అనే బ్రిటీష్ వైద్యులు 1897 లో మలేరియా వ్యాధి ఆడ అనాఫిలిస్ దోమ ద్వారా వ్యాప్తి చెందుతోందని తెలిపారు. ప్రపంచాన్ని వణికిస్తున్న మలేరియా జ్వరానికి కారణం ప్లాస్మోడియం అనే పరాణ్ణజీవని, ఈ పరాన్న జీవిని ఆడ అనాఫిలిస్ దోమ జీర్ణశయం లో గుర్తించి ప్రపంచానికి చాటి చెప్పడం తో, తెలిసిందని గుర్తు చేశారు.